ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 28 మార్చి 2024

డీసీఐ కేసు ఏప్రిల్ 11కి వాయిదా

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) కేసును హైకోర్టు ఏప్రిల్ 11వ తేదీకి వాయిదా వేసింది. తనను అన్యాయంగా తొలగించారని పాత ఎండీ, సీఈఓ జార్జి విక్టర్ కేసు వేశారు. తన కేసు తేలాకే కొత్త ఎండీ, సీఈఓ నియామకం నిర్ణయం తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఆ మేరకు హైకోర్టు నియామకంపై స్టే ఇచ్చింది. దానిని తొలగించాలని డీసీఐ వాదించింది. ఈ కేసులో తీర్పును ఏప్రిల్ 11న వెలువరిస్తామని పేర్కొంటూ హైకోర్టు విచారణను వాయిదా వేసినట్టు డీసీఐ వర్గాలు తెలిపాయి.

నీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారు!



'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి'కి ఉత్తుత్తి కేటాయింపులు

- ఐదేళ్లలో పైసా విదల్చని జగన్ సర్కారు

- తాండవ రిజర్వాయర్ ఆధునికీకరణ, నిర్వహణపై నిర్లక్ష్యం
- బడ్జెట్‌లో చూపిన నిధులే విడుదల చేయని ప్రభుత్వం
- రైవాడపైనా చిన్నచూపు
- జపాన్ రుణం ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వ వాటా 15 శాతం జమ చేయకపోవడంతో నిలిచిపోయిన ఆధునికీకరణ పనులు
- చిన్న చెరువుల పునరుద్ధరణపై అశ్రద్ధ
- ప్రపంచబ్యాంకు నుంచి 70 శాతం నిధులు
- కేవలం 30 శాతం సమకూర్చలేకపోయిన వైసీపీ ప్రభుత్వం
- నిలిచిపోయిన పనులు



పద్మనాభం మండలం రేవిడి గ్రామంలో సగంలో నిలిచిన యానాద్రి చెరువు పనులు

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ప్రభుత్వం నీటి పారుదల రంగాన్ని గాలికొదిలేసింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గడచిన ఐదేళ్లలో కొత్తగా ఒక ప్రాజెక్టు చేపట్టలేదు సరికదా... ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను కూడా పట్టించుకోలేదు. చివరకు జపాన్, ప్రపంచ బ్యాంకు సాయం/రుణంతో చేపట్టదలచిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వకపోవడంతో అవి కూడా అటకెక్కాయి. వచ్చే వర్షాకాలం నాటికి ప్రతి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాల్సి ఉండగా... కొత్తగా ప్రతిపాదనలు పంపొద్దంటూ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు తొలి దశలో ఉమ్మడి జిల్లాలో 1.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రతిపాదించారు. వైసీపీ ప్రభుత్వం సుజల స్రవంతి ప్రాజెక్టుకు 2019-20 బడ్జెట్‌లో రూ.170.06 కోట్లు, 2020-21 బడ్జెట్‌లో రూ.107.96 కోట్లు, 2021-22లో రూ.97.75 కోట్లు, 2022-23లో రూ.297.5 కోట్లు, 2023-24 బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయించింది. కానీ, గడచిన ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. చంద్రబాబు నాయుడు హయాంలో 2018లో కాంట్రాక్టర్‌కు రూ.12.8 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇచ్చారు. అవి తప్ప వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చెల్లింపులు జరపలేదు. గతంలో చేసిన పనులకు సంబంధించి రూ.8 కోట్ల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రజా ప్రతినిధుల ఒత్తిడి మేరకు వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు అంచనాను మూడేళ్ల క్రితం రూ.17,050.20 కోట్లకు సవరించి ఆమోదించింది. రెండో దశలో పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించి దాంట్లో రెండింటికి రూ.3,800 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. దీనికితోడు కాల్వల తవ్వకానికి భూసేకరణ పూర్తిచేసి నోటిఫికేషన్ ప్రకటించిన అధికారులు, నిధులు విడుదలైతే అవార్డు వివరాలు విడుదలకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికిప్పుడు ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికగా చేపట్టినా పూర్తిచేయాలంటే కనీసం ఐదు నుంచి ఎనిమిదేళ్ల సమయం పడుతుందని రిటైర్డు ఇంజనీరు ఒకరు వ్యాఖ్యానించారు. తాజా అంచనా మేరకు ప్రాజెక్టు వ్యయం రూ.20 వేల కోట్లకు చేరుకుంటుందని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో తాండవ, కోనాం, పెద్దేరు, రైవాడ, వరహా నీటి ప్రాజెక్టుల నిర్వహణకు గడచిన ఐదేళ్లలో అత్యంత తక్కువ మొత్తంలో నిధులు ఖర్చుచేశారు. వీటిలో కొన్ని ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినా సొమ్ములు విడుదలకు వచ్చేసరికి మరీ తక్కువ వచ్చాయి. దీంతో ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టిన ఖర్చులు చాలా వరకు బకాయిపడ్డారు.

ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలకు నీటి సరఫరా చేసే తాండవ రిజర్వాయర్ ... మిగతా 6వ పేజీలో

ఆచితూచి..

కొనసాగుతున్న 'కూటమి' అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ

- ఇంకా ఖరారు కాని భీమిలి అభ్యర్థి
- ఆశావహుల జాబితాలో గంటా, బంగార్రాజు, రాజాబాబు, బైరా ఫౌండేషన్ చైర్మన్
- 'సౌత్'పై సందిగ్ధం
- తొలుత వంశీకృష్ణ శ్రీనివాస్‌కు జనసేన గ్రీన్‌సిగ్నల్
- అధికారికంగా ప్రకటించని వైనం
- 'నార్త్'లో బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్‌రాజు ఖరారు



విష్ణుకుమార్‌రాజు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపిక ఇంకా కొనసాగుతూనే ఉంది. అధికార పార్టీ వైసీపీ విశాఖ జిల్లాలో పార్లమెంటు సహా అన్ని నియోజక వర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. కూటమిగా ఏర్పడిన తెలుగుదేశం, బీజేపీ, జనసేనలు ఇంకా ఆ ప్రక్రియ పూర్తిచేయలేదు. అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి.

విశాఖ పార్లమెంటు నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అందులో ఒకటి విజయనగరం జిల్లా ఎస్.కోట కాగా మిగిలిన ఆరు విశాఖ జిల్లాలో ఉన్నాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ ఐదు స్థానాలు ఉంచుకొని, మిగిలిన రెండింటిలో జనసేనకు ఒకటి (విశాఖ దక్షిణ నియోజకవర్గం), బీజేపీకి ఒకటి (విశాఖ ఉత్తరం) ఇచ్చింది. విశాఖ తూర్పు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకే మళ్లీ అవకాశం దక్కింది. అక్కడ వైసీపీ తరపున సిట్టింగ్ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ బరిలో దిగారు. పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబును టీడీపీ నిలపగా, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్‌ని వైసీపీ పోటీకి పెట్టింది. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. గాజువాకలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావునే టీడీపీ నిల్పోబెట్టింది. వైసీపీ తరపున మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ పోటీకి దించారు.

విశాఖ దక్షిణ నియోజకవర్గం సీటును జనసేనకు ఇవ్వగా దానికోసం చాలామంది పోటీ పడ్డారు. అయితే అదృష్టం తొలుత ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్‌ను వరించింది. ఎమ్మెల్సీ పదవిని వదులుకునేందుకు సిద్ధమై పార్టీలోకి వచ్చారనే కారణంతో ఆయన్ను పవన్‌కల్యాణ్ అభ్యర్థిగా ప్రకటించారు. అయితే వంశీకృష్ణపై అక్కడ కొంత వ్యతిరేకత వ్యక్తమైంది. పార్టీ కోసం పనిచేస్తున్న తమను పట్టించుకోలేదని కొందరు, అధికార పార్టీ నుంచి వచ్చినా తమను గుర్తించలేదని మరికొందరు సహాయ నిరాకరణ చేస్తున్నారు. వాస్తవానికి అక్కడ టీడీపీ నుంచి చక్కటి సహకారం అందుతోంది. ఆ నియోజవర్గాన్ని కేంద్రంగా చేసుకొని మూడేళ్లుగా పనిచేస్తున్న గండి బాబ్జీని అధిష్ఠానం పిలిచి బుజ్జగించింది. పొత్తులో భాగంగా ఆ సీటు ఇవ్వక తప్పలేదని, అధికారంలోకి వచ్చాక తగిన ప్రాధాన్యం ఇస్తామని భరోసా ఇచ్చింది. ఆయనకు పార్టీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్ష పదవి ఇచ్చింది. అయితే జనసేనలోనే అంతర్గత విభేదాలు ఉండడంతో పార్టీ అధినేత అక్కడి అభ్యర్థిపై పునఃపరిశీలన చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల ప్రకటించిన జనసేన అభ్యర్థుల జాబితాలో వంశీకృష్ణ శ్రీనివాస్ పేరు కనిపించలేదు. ఆయనకే ఇస్తారా?, వేరే వారిని బరిలో దింపుతారా?...అనేది మరో రెండు రోజుల్లో తేలుతుంది. ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ బరిలో ఉన్నారు.

విశాఖ ఉత్తర నియోజకవర్గాన్ని బీజేపీకి ఇవ్వడంతో ఆ పార్టీ ముందు నుంచి మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజునే పోటీకి దించాలని భావించింది. ఆ ప్రకారమే బుధవారం ప్రకటించిన జాబితాలో ... మిగతా 6వ పేజీలో

హాట్‌కేకుల్లా అమ్ముడైన ఐపీఎల్ టికెట్లు

చెన్నై సూపర్‌కింగ్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్లు అమ్మకాలు ప్రారంభించిన రెండు గంటల్లో సోల్డ్ అవుట్

- మధ్యాహ్నం 12.30 గంటలకే అయిపోయిన రూ.1,000, రూ.1,500, రూ.3,000, రూ.4,000 టికెట్లు
- మిగిలిన ధరల టికెట్ల అమ్మకాలపై స్పష్టత నిల్

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 27: ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ మధ్య ఈనెల 31న నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు దాదాపు అయిపోయాయి. పేటీఎం ఇన్‌సైడర్ ద్వారా బుధవారం టికెట్ల అమ్మకం ప్రారంభించగా క్రీడాభిమానుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఉదయం పది గంటలకు అమ్మకాలు ప్రారంభించగా...సెకన్లలోనే 70 వేలకు మందికిపైగా లాగిన్ అయ్యారు. విక్రయం ప్రారంభించిన రెండు గంటల్లోనే రూ.1,000, రూ.1,500, రూ.3,000, రూ.4,000 టికెట్లు అయిపోయాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు రూ.1,000, రూ.1,500, రూ.3,000, రూ.4,000 టికెట్లు అమ్ముడైపోయాయని ప్రకటిస్తూ క్లోజ్ చేశారు. అయితే రూ.2,000, రూ.2,500, రూ.3,500, రూ.5,000 టికెట్లపై స్పష్టత లేదు. మిగిలిన టికెట్ల అమ్మకాలు గురువారం చేపడుతున్నదీ లేనిదీ కూడా నిర్వాహకులు ప్రకటించలేదు.

ఈ మ్యాచ్ కాకపోతే ఆ మ్యాచ్...

చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ టికెట్లు దొరక్కపోవడంతో కొందరు ఏప్రిల్ 3వ తేదీన కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగే మ్యాచ్ టికెట్లు తీసుకున్నారు. దీంతో బుధవారం రాత్రి సమయానికి రూ.1,000, రూ.1,500, రూ.2,000 టికెట్లు అమ్ముడైపోయాయి. రూ.2500, రూ.3000, రూ.3500, రూ.5000 ధర టికెట్లు అందుబాటులో ఉన్నాయి.

భారత్-అమెరికా నేవీ సముద్ర విన్యాసాలు



భారత్, అమెరికా దేశాల నౌకాదళాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న టైగర్ ట్రయంఫ్-24 కార్యక్రమం రెండో దశలో భాగంగా సముద్ర విన్యాసాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 18న ప్రారంభమైన టైగర్ ట్రయంఫ్ నెలాఖరు వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. రెండు దేశాలకు చెందిన 700 మందికి పైగా సైనికులు సముద్ర విన్యాసాల్లో పాల్గొన్నారు. సముద్రంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరిస్తూ ప్రతికూల వాతావరణంలోను లక్ష్యం కోసం పనిచేసే సత్తాను చాటేలా విన్యాసాలు ప్రదర్శించారు. విపత్తు సమయాల్లో సమన్వయంతో పనిచేయడం, పక్కా ప్రణాళికలు రూపొందించుకోవడం, వాటిని చక్కగా అమలు చేయడానికి ప్రాధాన్యం ఇచ్చినట్టు నేవీ వర్గాలు వెల్లడించాయి. -విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

సుదర్శన నారసింహ యజ్ఞానికి శ్రీకారం



లఘు పూర్ణాహుతిలో పాల్గొన్న శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర, తదితరులు

సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో బుధవారం శ్రీసుదర్శన నారసింహ మహాయజ్ఞానికి అంకురార్పణ జరిగింది. నృసింహ అష్టోత్తర శతనామావళితో ప్రత్యేక పూజలు చేసి అగ్నిమథనం జరిపారు. లఘు పూర్ణాహుతిలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి తదితరులు పాల్గొన్నారు. - వివరాలు 12లో

మహిళా సంఘాలకు వైసీపీ ఎర

యూసీడీ సిబ్బందితో కలిసి వార్డుల వారీగా రహస్య సమావేశాలు

- నగదు, చీరలు పంపిణీ చేస్తామంటూ హామీ ఇస్తున్న అభ్యర్థులు
- రిసోర్స్ పర్సన్లకు రూ.25 వేలు చొప్పున అందజేత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు అడ్డదారులు తొక్కడానికి సైతం వెనుకాడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ పార్టీ అభ్యర్థికి ఓటేసేలా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రలోభాలకు గురిచేసే పనిలో నిమగ్నమయ్యారు. దీనికోసం జీవీఎంసీ యూసీడీ (అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్) సిబ్బందితో కలిసి నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటుచేస్తున్నారు.

జీవీఎంసీ పరిధిలో 33,174 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 3.4 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఒక్కో సభ్యురాలి ఇంట్లో సగటున మూడు ఓట్లు ఉన్నాయనుకున్నాసరే పది లక్షల ఓట్లు మహిళా సంఘాల సభ్యుల కుటుంబాలవే ఉంటాయని రాజకీయ పార్టీల నేతలు అంచనా వేస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులతోపాటు వారి కుటుంబ సభ్యుల ఓట్లను కూడా రాబట్టుకోగలిగితే వచ్చే ఎన్నికల్లో విజయావకాశాలు మెరుగుపడతాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు. అందుకోసం మహిళా సంఘాలను సమన్వయం చేసే జీవీఎంసీ యూసీడీ సిబ్బంది సహకారాన్ని తీసుకుంటున్నారు. ముందుగా యూసీడీ పరిధిలో ఉన్న వెయ్యి మంది రీసోర్స్ పర్సన్లతో వైసీపీ నేతలు కొద్దిరోజుల కిందట నియోజకవర్గాల వారీగా సమావేశం ఏర్పాటుచేశారు. ఆ సమావేశానికి యూసీడీ అధికారులతోపాటు ఆయా నియోజక వర్గాల్లో వైసీపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా హాజరయ్యారు. అన్ని నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే ఆర్పీల్లో కొందరికి రూ.25 వేలు చొప్పున నగదు అందించి, వచ్చే ఎన్నికల్లో తమ గెలుపునకు సహకరించాలని వైసీపీ అభ్యర్థులు కోరినట్టు సమాచారం. ఆర్పీల సహాయంతో యూసీడీ సిబ్బంది వార్డుల ... మిగతా 6వ పేజీలో



ఉత్తర వైసీపీ అభ్యర్థి కేకే రాజు పంపిణీ చేసిన కానుకల సంచులతో మహిళలు (ఫైల్ ఫొటో)

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- లేకుంటే చర్యలు తీసుకుంటాం
- రిటర్నింగ్ అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున
- ఇంటిపై జెండాలు, బ్యానర్లు ఉంచుకోవచ్చు

- 6లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.13
సహరి (శుక్ర)	4.41



స్వాధీనం చేసుకున్న తాబేలు పిల్లలు



396 తాబేలు పిల్లలు స్వాధీనం

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా నుంచి చెన్నైకు రవాణా చేస్తున్న 396 సముద్ర తాబేళ్ల పిల్లలను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్నారు. కోల్‌కతా నుంచి షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ తాబేళ్లను తరలిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి పట్టుకున్నారు. తాబేళ్లను వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 షెడ్యూల్-5లో చేర్చారు. అందువల్ల తాబేళ్ల అక్రమ రవాణా నిషేధం. ఈ నేపథ్యంలో తాబేళ్లను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకుని అటవీ శాఖకు అప్పగించారు.

ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలి: ఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హెస్సేన్ సాహెబ్

జ్ఞానాపురం, మార్చి 27: ఎన్నికలు నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేపట్టాలని పశ్చిమ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం జ్ఞానాపురంలోని పశ్చిమ నియోజకవర్గ ఆర్వో కార్యాలయ సమావేశ మందిరంలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసీసీ, వీఎస్టీ బృందాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులపై త్వరతగతిన స్పందించాలన్నారు. రాజకీయపార్టీలు ఎన్నికల నియమావళి పాటిస్తున్నారా.. లేదా.. అన్న విషయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలన్నారు.

కేవీలో విద్యార్థులకు ప్రగతి కార్డులు పంపిణీ


విద్యార్థులతో కేవీ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, మార్చి 27: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న బాలవాటిక, ఐదో తరగతి విద్యార్థులకు రిపోర్టు కార్డులను బుధవారం కేవీ ప్రిన్సిపల్ కమల్‌జిత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పిల్లలను చక్కగా తీర్చడానికి వీలుంటుందన్నారు.ఐదో తరగతి పిల్లలు ప్రైమరీలో అత్యధిక తరగతి హోల్డర్లుగా ఉన్నారన్నారు. ఇలాంటి వారు ఆరో తరగతిలో మరింత మార్పుతో చక్కగా చదువుతారని పేర్కొన్నారు. ఈ పిల్లలకు కొత్తస్థాయికి సర్దుబాటుకు వీలుగా బ్రిడ్జ్ కోర్సు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వీఎం శైలజ, ఉపాధ్యాయులు జి.వాణి, విజయలక్ష్మి, భవాని, డాక్టర్ త్యాగరాజ్, మిట్టపల్లి రేఖ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు సెలవు

భీమునిపట్నం (రూరల్) మార్చి 27: ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఒకరోజు స్పెషల్ కేజువల్ లీవ్‌ను వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది ఈ మేరకు 536 నంబరుతో ఉత్తర్వులను జారీ చేసింది. విధుల్లో నియమితులై, వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు తమ నియోజకవర్గంలో ముందుగా ఓటు వేసుకునే వీలుంటుంది. వీరికి ముందుగానే పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. ఓటును రిటర్నింగ్ అధికారికి పంపించడానికి వీలుగా ప్రతి నియోజకవర్గంలో ఫెసిలిటేటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇవి నియోజకవర్గ కేంద్రాలలో రిటర్నింగ్ అధికారి వద్ద ఉంటాయి. ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ అందజేయడానికి స్పెషల్ కేజువల్ లీవ్‌ను వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. ఇతర సెలవులతో సంబంధం లేకుండా ఈ సెలవును ఉద్యోగులంతా వాడుకునేలా ఉత్తర్వులిచ్చారు.

సెయింట్ జోసెఫ్‌ను సందర్శించిన తెలుగు అధ్యాపకులు


బెంగళూరునుంచి వచ్చిన అధ్యాపకులు

జ్ఞానాపురం, మార్చి 27: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలను మైసూర్‌లోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ అఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ సంస్థ (సీఐఐఎల్)లో శిక్షణ పొందుతున్న దక్షిణ భారతదేశంలోని తెలుగు అధ్యాపకులు బుధవారం సందర్శించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాలలోని విద్యాసంబంధ కార్యక్రమాల అమలు తీరు, గ్రంథాలయంలో వివిధ భాషల పుస్తకాలను చూసి సంతోషం వ్యక్తంచేశారు. అనంతరం విద్యార్థులతో తెలుగులో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, డాక్టర్ మిరియాల సత్యనారాయణ, డా.జె.నిర్మల, డాక్టర్ దీప్తి, సిస్టర్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

అరణ్య అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో వికాసం : రైల్వే జీఎం


యాక్టివిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జీఎం మనోజ్ శర్మ

విశాఖపట్నం, మార్చి 27: వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమసంఘం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహిస్తున్న మాంటిస్సోరీ స్కూల్, హెరిటేజ్ వాక్‌కు సంబంధించి అరణ్య అవుట్‌డోర్‌క్యాంపింగ్, యాక్టివిటీ సెంటర్‌ను తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంటిస్సోరి స్కూల్ విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యానికి అవుట్‌డోర్ క్యాంపింగ్ సదుపాయం, స్కౌట్స్ అండ్ గైడ్స్ క్యాడెట్లకు యాక్టివిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసి వారిలో ప్రతిభకోసం కృషి చేస్తున్న వాల్తేర్ రైల్వే మహిళా సంక్షేమ సంఘ ప్రతినిధులుఅభినందనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు దివ్య శర్మ, డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, ఈకార్యో అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్, కవితా గుప్తా, ముదుస్మిత సాహు పాల్గొన్నారు.

సీపీ రవిశంకర్ అయ్యన్నార్‌కు డీజీపీ గోల్డ్ డిస్క్ అవార్డు

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అయ్యన్నార్‌కు డీజీపీ గోల్డ్ డిస్క్ అవార్డు లభించింది. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచే అధికారులు, సిబ్బందికి డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి మూడు కేటగిరీల్లో డిస్క్ అవార్డులను బుధవారం ప్రకటించారు. సీపీ రవిశంకర్ అయ్యన్నార్‌తోపాటు సీసీఎస్ ఏఎస్ఐ పి.చంద్రశేఖర్, పెందుర్తి క్రైమ్ కానిస్టేబుల్ ఎం.రఘురామ్‌లకు గోల్డ్‌డిస్క్ అవార్డు లభించింది. డీజీపీ బ్రాంజ్ డిస్క్ కేటగిరీలో ఏఆర్ ఏడీసీపీ కె.సుబ్రహ్మణ్యం, దిశ ఏసీపీ సీహెచ్ వివేకానంద, దిశ సీఐ జి.నిర్మల, సీఐ ఎస్వీ ప్రభాకరరావుతోపాటు మరో పదిమందికి అవార్డులు దక్కాయి.


దసపల్లా వద్ద ఫుట్‌పాత్‌లపై వ్యాపార సామగ్రి


జగదాంబ వద్ద ముందుకు వచ్చిన దుకాణం పైభాగం

ఓవైపు విస్తరణ పనులు.. మరోవైపు ఆక్రమణలు

» వన్‌టౌన్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు

జగదాంబ కూడలి, మార్చి 27: జగదాంబ నుంచి వన్‌టౌన్ వరకు రోడ్డు విస్తరణ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా జీవీఎంసీ అధికారులు చేపట్టిన రోడ్డు విస్తరణకు ఫుట్‌పాత్ వ్యాపారులనుంచి సమస్యలు నెలకొంటున్నాయి. ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు, వ్యాపార వర్గాలు తమ స్థలాలను వదులుకుని సహకరించడంతో రోడ్డు విస్తరణ పనులు సజావుగా సాగుతున్నాయి. పెరుగుతున్న జనాభా, వాహనాలతోపాటు పాతనగరం అభివృద్ధిలో భాగంగా ఈ పనులు పూర్తిచేస్తున్నారు. మరోవైపు రోడ్డు, ఆధునికీకరించిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమిస్తున్నారు. ఇప్పటికే నగరంలో ఆధునికీకరించిన ఫుట్‌పాత్‌లు, వ్యాపార కూడళ్లు సరికొత్త అందాలను తెచ్చిపెడుతున్నాయి. కానీ, జగదాంబ జంక్షన్ వాచ్‌హౌస్, దసపల్లా మెయిన్‌రోడ్డులో ఫుట్‌పాత్ నిర్మాణాలు పూర్తయినా, వీటిని పూర్తిగా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు కోట్లాది రూపాయల ప్రజల సొమ్ముతో ఆధునికీకరించిన స్థలాలు, ఫుట్‌పాత్‌లు ఇలా ఆక్రమణలకు లోనుకావడంపై జనాలనుంచి విమర్శలు తలెత్తుతున్నాయి. జగదాంబ, టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్ కొత్త రోడ్డు, కురుపాం మార్కెట్ ఏరియాల్లో కొత్తగా చేపట్టిన ఫుట్‌పాత్‌ల్లో చాలా మేరకు ఆక్రమణలోకి వెళ్లాయి. దీంతో రోడ్డుపై జనం నడిచేందుకు అవకాశం లేని పరిస్థితి నెలకుంది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ 60 అడుగుల రోడ్డు విస్తరించినట్టు గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేగా ఉంది. ఆయన తన అనుచరగణం చెప్పిన వారికి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు అవకాశమిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

ఎన్నికల నిబంధనలు పాటించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులదే కీలకపాత్రని, వారంతా తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టరు ఎ.మల్లికార్జున ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రిటర్నింగ్, పోలింగ్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్ బృందాలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఆర్వోలు తప్పనిసరిగా నియమావళిని పాటించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాలు, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, గోడపత్రికలు, బ్యానర్లు అనుమతించరాదన్నారు. జాతీయ రహదారి, ప్రధాన రహదారుల సమీపంలో ఇప్పటివరకు ఉన్న హోర్డింగ్‌లను సమాన ప్రాతిపదికగా అన్ని రాజకీయ పార్టీలకు కేటాయిస్తున్నామన్నారు. గోడలపై రాజకీయపార్టీలు అతికించిన స్టిక్కర్లు, గోడపత్రికలను తొలగించాలన్నారు. అయితే ఇంటిలోపల ఉన్న పోస్టర్లు, స్టిక్కర్లపై జోక్యం అవసరం లేదన్నారు. ఇంటి పైకప్పులపై సంబంధిత యజమాని అనుమతితో జెండాలు, బ్యానర్లు ఉంచుకోవచ్చునని అయితే దీనికి ఆర్వో అనుమతి ఉండాలన్నారు. వివిధ ప్రాంగణాల్లో శిలాఫలాకాలపై ఉన్న రాజకీయ నాయకుల పేర్లు తొలగించాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటివరకు జిల్లాలో పదిమంది వలంటీర్లపై కేసులు నమోదుచేసి, తొలగించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఒక వ్యక్తి వద్ద వస్తు రూపంలో రూ.10 వేలకు మించరాదని, రూ.20 వేలకు మించి విరాళాలు స్వీకరించవద్దని, రూ.50 వేలకు మించి నగదు ఉండరాదని, అంతకుమించి ఉన్న నగదును సీజ్ చేస్తామన్నారు. డ్రగ్స్, మద్యం, ఆభరణాలు, వస్త్రాలు, ఇతర వస్తువులను పంపిణీ చేయరాదన్నారు. పార్టీలు నిర్వహించే ర్యాలీలు, సభలకు సీవిజల్ ద్వారా దరఖాస్తు తీసుకున్న 48 గంటల్లో అనుమతి ఇవ్వాల్సి ఉందని, అయితే దరఖాస్తులను తక్షణమే పరిశీలించి మంజూరుచేయాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదయ్యేలా చూడాలని, గత ఎన్నికల్లో 65 శాతం నమోదైందన్నారు. ఈసారి 75 శాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో నగరంలో ఐదువేల చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టిసారించాలన్నారు. వచ్చే నెల 14 వరకు ఫారం 6 కింద ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరించవచ్చునన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పోస్టల్ బాలెట్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. మొత్తం ఎనిమిది రకాల పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయన్నారు. సమావేశంలో ఎంసీసీ నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంతవర్మ, జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో మోహనకుమార్, ఆర్వోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, శేషశైలజ, లక్ష్మారెడ్డి, అఖిల, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలు


వైసీపీ బీసీ సెల్ నేత మన్యాలకు జనసేన కండువా వేస్తున్న వంశీకృష్ణ

మహారాణిపేట, మార్చి 27: రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌ల నాయకత్వం అవసరమని దక్షిణ నియోజకవర్గ టీడీపీ, జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 100 మందికి పైగా ఆపార్టీ కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. వారికి వంశీకృష్ణ శ్రీనివాస్ జనసేన పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, పవన్ కల్యాణ్ సత్తా ఉన్న నేత అని అన్నారు. వారి నాయకత్వం రాష్ట్రానికి ఉందన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిని ప్రజలు కోరుకుంటున్నారని, ఈ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపొందుతారని ఆయన ఆశాభావంవ్యక్తంచేశారు. నాయకులు మైలిపిల్లి సూర్యారావు, పెద్దరాజు గిరిబాబు , కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీకి అభినందనలు


గండిబాబ్జీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

మాధవధార, మార్చి 27; తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన గండి. బాబ్జీని 50వవార్డు ఆ పార్టీ అధ్యక్షులు సనపల. వరప్రసాద్, తెలుగుమహిళా విభాగం నాయకురాలు ఈతలపాక సుజాత, 49, 54, 46, 53వవార్డుల నాయకులు చక్రి, సౌజన్య, రాజు, కార్తీక్ కుట్టా తదితరులు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గండి బాబ్జీ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులంతా సమష్టిగా పనిచేయాలని సూచించారు. పార్టీ శ్రేణులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రతి ఓటరుకి వివరించాలని కోరారు.

సముద్ర మార్గంలో డీజిల్ అక్రమ రవాణా

» 13 మంది ముఠాలో ముగ్గురి అరెస్టు...పదిమంది పరారీ



మాట్లాడుతున్న డీసీపీ 2 సత్తిబాబు

మహారాణిపేట, మార్చి 27: సముద్ర మార్గం ద్వారా డీజిల్ అక్రమంగా రవాణా చేసి విక్రయిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నామని డీసీపీ 2 సత్తిబాబు తెలిపారు. ఈ ముఠాలో మొత్తం 13 మంది సభ్యులు ఉండగా వారిలో ముగ్గురిని అరెస్టు చేశామని, మరో పదిమంది పరారయ్యారన్నారు. పోలీసు కమిషనరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. విశాఖకు చెందిన ఆయిల్ మాఫియా ముఠా కాకినాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాల నుంచి బోట్ల ద్వారా డీజిల్‌ను అక్రమంగా సేకరించి, విశాఖ ఫిషింగ్ హార్బర్ జట్టీ వద్దకు తరలించి, లీటరు రూ.60 నుంచి రూ.70 చొప్పున విక్రయిస్తోందన్నారు. దీనిపై పక్కాగాసమాచారం అందడంతో బుధవారం ఉదయం పోలీసులు దాడులు జరిపారన్నారు. ఇందులో భాగంగా డీజిల్ కొనుగోలు చేస్తున్న నగరవాసి సూరాడ రామును అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. అతడు తెలిపినవివరాల మేరకు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన బడే రాజు, నొల్లు వీర్రాజు లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 480 లీటర్లు డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈముఠాలో మరో పది మంది పరారీలో ఉన్నారని,వారి కోసంగాలిస్తున్నామన్నారు.

విధుల్లో అలసత్వంపై ప్లానింగ్ కార్యదర్శి సస్పెన్షన్‌కు ఆదేశం


దువ్వాడ రైల్వే స్టేషన్ రహదారిలో పర్యటిస్తున్న అడిషినల్ కమిషనర్ విశ్వనాథ్

కూర్మన్నపాలెం, మార్చి 27: భరత్‌నగర్-2 ప్లానింగ్ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్న సాయిరామ్‌పై పలు ఫిర్యాదులు రావటంతో ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని జీవీఎంసీ అడిషినల్ కమిషనర్ విశ్వనాథ్ ఆదేశాలు జారీ చేశారు. జీవీఎంసీ 86 వార్డు కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్ రహదారి విస్తరణ పనులను బుధవారం ఏడీసీ పర్యటించారు. ఉడాఫేజ్-6లో రోడ్డుకిరువైపులా రబ్బీస్, నిర్మాణ సామగ్రి ఉండటం గుర్తించిన ఆయన సదరు ప్లానింగ్ కార్యదర్శులు అన్నెపు శ్రీను,సాయిరామ్‌లపైఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల్లో అలస త్వం వహించినా, అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని ఈసందర్భంగా హెచ్చరించారు.ఇటీవల ప్లానింగ్ కార్యదర్శులపై ఎక్కువగాఫిర్యాదులువస్తున్నాయన్నారు. ఈపర్యటనలోఏసీపీ లక్ష్మి,ఈఈ ప్రసాద్, ఏపీడీ రాము, ఏఎంహెచ్‌ఓకిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో శత శాతం సౌకర్యాల కల్పన: జేసీ


అధికారులతో మాట్లాడుతున్న జేసీ అశోక్

మహారాణిపేట, మార్చి 27: ప్రతీ సెక్టార్ అధికారి తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శతశాతం కనీస సదుపాయాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ కే మయూరి అశోక్ ఆదేశించారు. బుధవారం తూర్పు నియోజకవర్గానికి సం బంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఆర్‌వో, సెక్టోరియల్ రూట్ అధికారుల, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేం ద్రాల్లో విద్యుత్, తాగునీటి తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.ఈనెలాఖరులోగా వసతుల ఏర్పాటుపై పూర్తి చర్యలు తీసు కో వాలని కోరారు. ప్రజల్లో ఓటు హక్కుపై చైతన్యం కలిగించేలా అవగాహన క ల్పించాలని కోరారు.

ఎన్నికల నియమావళి అమలుకు పటిష్ట చర్యలు

తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు జేసీ అశోక్ తెలిపారు. తన చాంబర్‌లో తూర్పు ని యోజకవర్గం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కొత్తగా ఓటు నమోదు దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి తర్వాతే ఆమోదిస్తామన్నారు. ఈ సమావేశంలో అన్ని పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నీటి ప్రాజెక్టులకు గాలికొదిలేశారు!

... 5వ పేజీ తరువాయి

నిర్వహణ, ఆధునికీకరణపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తొలిసారిగా 2020-21లో రూ.80.91 లక్షలు, 2021-22లో రూ.99.8 లక్షలు, 2022-23లో 89.93 లక్షలు బడ్జెట్‌లో కేటాయించినా రూపాయి విడుదల చేయలేదు. గత ఏడాది మార్చిలో నిర్వహణ, మరమ్మతులకు రూ.ఆరు కోట్లు కేటాయించినా ఇంతవరకూ కాంట్రాక్టర్లు ఎవరు ముందుకురాలేదు. అయితే ఈ నిధులు కూడా విడుదల కాలేదు. కమాండ్‌ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద సుమారు రూ.3.5 కోట్లు పనులకు నాలుగేళ్ల క్రితం ఆమోదం తెలిపారు. వాటిలో రూ.2 కోట్ల బిల్లులు కాగా మరో రూ.1.5 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. డ్యామ్ నిర్వహణ బిల్లులు చాలా వరకు చెల్లించాల్సి ఉంది.

రైవాడ రిజర్వాయర్ నిర్వహణ, మరమ్మతులకు 2021-22 బడ్జెట్‌లో రూ.9.28 లక్షలు, 2022-23లో రూ.171.75 లక్షలు కేటాయించినా పైసా విడుదల చేయలేదు. జపాన్ రుణం రూ.30.43 కోట్లతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఇప్పటివరకూ రూ.4.17 కోట్లు ఖర్చు చేయగా రూ.2.88 కోట్లు బిల్లులు మంజూరుచేశారు. మిగిలిన మొత్తంవిడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ తట్టాబుట్టా సర్దుకుని వెళ్లిపోయారు. ప్రాజెక్టు వ్యయంలో 85 శాతం జపాన్ విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 15 శాతం ఇవ్వాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా సొమ్ము విడుదల చేయకపోవడంతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. అలాగే కోనాం రిజర్వాయర్, కాలువల నిర్వహణ, మరమ్మతులకు 2019-20 నుంచి 2022-23 వరకు రూ.80.86 లక్షలు, పెద్దేరుకు రూ.2.65 లక్షలు మాత్రమే కేటాయించారు. అవికూడా విడుదల చేయలేదు. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా ప్రాజెక్టుల నిర్వహణ అంటే జనరేటర్‌కు డీజిల్, గేట్లకు గ్రీజు, విద్యుత్ బిల్లులు, ఇతరత్రా ఖర్చులకు అప్పులు చేయాల్సి వచ్చింది. పెద్దేరు రిజర్వాయర్ నుంచి అదనపు ఆయకట్టుకు నీరందించేందుకు రూ.9.12 కోట్లతో పనులు చేపట్టాలని గత ఏడాది ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ పనులకు గత ఏడాది రూ.84.4 కోట్ల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో టెండర్లు పిలవగా ఒకరు వచ్చారు.

చిన్న చెరువుల అభివృద్ధిపై నిర్లక్ష్యం

ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో ఆంధ్రప్రదేశ్ సమీకృత సేద్య, వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు (ఏపీఐఐఏటీపీ) కింద ఉమ్మడి జిల్లాలో రూ.33.46 కోట్లతో 50 చెరువుల పునరుద్ధరణకు ఆమోదం లభించింది. ప్రపంచ బ్యాంకు 70 శాతం నిధులు మంజూరుచేయగా, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వాటాగా ఇవ్వాల్సి ఉంది. మొదట 33 చెరువులకు సంబంధించి 13 పనులకు రూ.20.84 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే ఇప్పటివరకు కేవలం రూ.1.93 కోట్ల విలువైన పనులు పూర్తిచేయగా రూ.1.29 కోట్లు బిల్లులు మంజూరుచేశారు. అవి కూడా 2022లో బిల్లులు అప్‌లోడ్ చేయగా 2023లో ఖాతాలకు జమ అయ్యాయి. దీంతో పద్మనాభం మండలం రేవిడి గ్రామంలో యానాద్రి చెరువు, దేవరాపల్లి మండలం మునిడిపల్లెలో మాటలవాని చెరువు, నాగరాయుడు చెరువు, తెనుగుపూడిలో రాజుచెరువు పనులు సగంలో నిలిచిపోయాయి. కాగా ప్రపంచ బ్యాంకుతో చేపట్టాల్సి ఉన్న మిగిలిన 17 చెరువుల అభివృద్ధికి కాంట్రాక్టర్లు చేసుకున్న ఒప్పందాలు రద్దు చేసుకున్నారు. ఇదిలావుండగా శారదా నదిపై పలుచోట్ల గ్రోయిన్లకు ప్రత్యామ్నాయంగా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. జిల్లాల విభజనతో విశాఖలో ఉన్న జలవనరుల శాఖ ఈఈ కార్యాలయాన్ని నర్సీపట్నానికి తరలించారు. గత ఏడాది అక్టోబరు నెలాఖరున ఈఈ శ్రీనివాసరావు స్వచ్ఛంద పదవీ విరమణ చేయగా అప్పటి నుంచి నర్సీపట్నం డీఈ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయినా ఉన్న సిబ్బందికే పని లేదు. ఇదిలావుండగా రానున్న ఖరీఫ్ నాటికి ప్రాజెక్టులు, కాల్వలను సిద్ధం చేయాల్సి ఉన్నా అధికారులు వాటి సంగతే మరిచిపోయారు. నిధుల కోసం కొత్తగా ప్రతిపాదనలు పంపవద్దని గత ఏడాది ప్రభుత్వం ఆదేశించింది.

ఆచితూచి...

... 5వ పేజీ తరువాయి

ఆయన పేరు ఖరారు చేసింది. బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్‌రాజు ఉండగా వైసీపీ తరపున కేకే రాజు పోటీ చేస్తున్నారు.

భీమిలిపై తేలని ఉత్కంఠ

భీమిలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిపై ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. అక్కడి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అధిష్టానాన్ని కోరారు. అయితే విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయాలని చంద్రబాబునాయుడు ఆదేశించారు. కానీ గంటా మాత్రం భీమిలిపైనే ఆశలు పెట్టుకున్నారు. ఆయనతోపాటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కోరాడ రాజాబాబు, నెల్లిమర్ల ఇన్‌చార్జిగా పనిచేసిన కర్రోతు బంగార్రాజు, బైరా ఫౌండేషన్ ఛైర్మన్ దిలీప్ చక్రవర్తి కూడా భీమిలి సీటు ఆశిస్తున్నారు. ఇంకా ఎవరి పేరునూ ప్రకటించలేదు. అధికార పార్టీ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావునే అభ్యర్థిగా ప్రకటించింది. ఆయన ప్రచారం చేసుకుంటూ పోతున్నారు.

మహిళా సంఘాలకు వైసీపీ ఎర

... 5వ పేజీ తరువాయి

వారీగా మహిళా సంఘాల సభ్యులను రహస్యంగా ఒకచోట సమావేశపరిచి, అక్కడకు వైసీపీ అభ్యర్థులను ఆహ్వానిస్తున్నారు. కొంతమంది అభ్యర్థులు అక్కడికక్కడే మహిళలకు తాయిలాలుగా నగదు, చీరలు, కిట్‌లు అందజేస్తుంటే...మరికొందరు మాత్రం మరోసారి కలిసినప్పుడు పంపిణీలు ఉంటాయని హామీ ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కొద్దిరోజులు కిందట మురళీనగర్‌లో ఇదే తరహా సమావేశం ఏర్పాటుచేశారంటూ టీడీపీ నేతలు ఆరోపించగా, బుధవారం పెదవాల్తేరు, శివాజీపాలెంలో కూడా మహిళా సంఘాల సభ్యులతో వైసీపీ నేతలు, ఆర్పీలు సమావేశం ఏర్పాటుచేసినట్టు టీడీపీ నేతలు ఆరోపించారు. ఇలాంటి సమావేశాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు నిఘా పెట్టి, చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, ఎందుచేతనో ఆ పనిచేయడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో సౌభాగ్యలక్ష్మి ఆరాధనోత్సవం


అలంకరణలో అమ్మవారు

జగదాంబ కూడలి, మార్చి 27: శ్రీ మహాలక్ష్మి జయంతిని పురస్కరించుకుని వీసవీ క్లబ్ వనిత కేసీజీఎఫ్ వైజాగ్ ఫెమినా ఆధ్వర్యంలో బుధవారం అబింకాబాగ్ రామాలయంలో శ్రీ సౌభాగ్యలక్ష్మి ఆరాధనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యాక్రమంలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కేసీజీఎఫ్ వైజాగ్ ఫెమినా ఛైర్‌పర్సన్ బీవీ సావిత్రి సౌభాగ్యలక్ష్మి ఆరాధనోత్సవం విశిష్టతను మహిళలకు వివరించారు. శ్రీమహాలక్ష్మి జయంతి రోజున సౌభాగ్యలక్ష్మిని ఆరాధిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయన్నారు. పూజానంతరం మహిళలకు వాయినాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ వనిత వింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న మహిళలు

రైతుబజారులో తూనిక కాటాల తనిఖీ

సీతమ్మధార, మార్చి 27 : స్థానిక రైతుబజారులో తూనిక కాటాల సీళ్లు, స్టాంప్‌లను మెట్రోపాలజీ ఇన్‌స్పెక్టర్ రామారావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. కొన్ని కాటాలకు సీళ్లు లేకపోవడం, ఇతర కారణాలతో జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటాలకు తప్పకుండా సీళ్లు, స్టాంపులను వేయించుకోవాలని, లేకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

32వ వార్డులో జనసేన ప్రచారం

అల్లిపురం, మార్చి 27: టీడీపీ, జనసేన, బీజేపి ఉమ్మడి అభ్యర్థి వంశీ కృష్ణ టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీతో కలిసి 32వవార్డు గోకుల్ థియేటర్ పాంతంలో ప్రచారం ప్రారంభించారు. ఇంటిఇంటికీ వెళ్లి వారి సమస్యలను అ డిగి తెలుసుకున్నారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

కొమ్మాది, మార్చి 27: కారుఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. పీఎం పాలెం సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. మధురవాడలోనిచంద్రంపాలెం శ్రీనివాసనగర్‌లో కోన్రు అప్పారావు (53) నివా సం ఉంటున్నాడు. సోమవారం ఉదయం అతను తన భార్య, కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై నగరంలోకి వెళుతుండగా వెనుక నుం చి కారు ఢీకొంది. దీంతో అప్పారావుకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి.బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.



పండ్ల అలంకరణ నడుమ ముత్యమాంబ

నేడు ముత్యమాంబ ప్రధాన పండుగ

వేపగుంట మార్చి 27: వేపగుంట నాయుడుతోట పరిసర 14 గ్రామాల ఆరాధ్య దైవం ముత్యాలమ్మ పండుగను గురువారం ఘనంగా నిర్వహించేందుకు గ్రామ కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా అమ్మవారితోపాటు ఆలయ ప్రాంగణాన్ని బుధవారం యాపిల్, పైనాపిల్ పండ్లతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు సుమారు రూ.లక్షన్నర వెచ్చించి 550 కిలోల యాపిల్ సేకరించి అలంకరణ చేపట్టారు. సాయంత్రం అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పీలా శ్రీను దంపతులు తులం బంగారం, చీర బహూకరించారు. పండుగ దృష్ట్యా ఆలయ ఆవరణాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

కొండయ్యవలసలో మరిడిమాంబ జాతర

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస ఉక్కు నిర్వాసితుల గ్రామాల ఆరాధ్యదేవత మరిడిమాంబ జాతరను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వాసిత కాలనీలను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఉగాది సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక, మార్చి 27: చినగడుపూరు నూకాంబిక ఆలయంలో ఏప్రిల్ ఏడు నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఉగాది సంబరాల పోస్టర్‌ను బుధవారం బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, సుజాత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఉగాది సంబరాలను నిర్వహిస్తామన్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా పలు సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పలరాజు, గోవింద్, రాంబాబు, రామునాయుడు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న విగ్రహ ప్రతిష్ఠ పోస్టర్..

పెదగంట్యాడ: వాంబేకాలనీలోని వెంకటాద్రి కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలోని విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గాజువాకలో వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్ నరసింహపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

బెంగాలీల నాయకురాలి మృతికి ఆడారి ఆనంద్‌కుమార్ సంతాపం

ఎన్.ఎ.డి, జంక్షన్ మార్చి 27: జీవీఎంసీ 90వ వార్డు వినోద్‌నగర్‌లో మృతి చెందిన బెంగాలీల మహిళా నాయకురాలు ప్రియంత బిశ్వాస్ కుటుంబ సభ్యులను వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పరామర్శించారు. మంగళవారం బీపీ పెరిగిపోవడంతో ఆమె మృతి చెందారు. బుధవారం ఆనంద్‌కుమార్ బిశ్వాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు నమ్మి శ్రీను, ఇన్‌చార్జి చుక్కా ప్రసాద్ రెడ్డి, నాయకులు ఎల్లపు వెంకటేశ్వరరావు, రామకృష్ణ, ఆళ్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం చారిత్రక అవసరం

గాజువాక నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు



అక్కిరెడ్డిపాలెం పంచవటి కాలనీలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో ప్రచారం చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 27: వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని, ప్రజలను విముక్తులను చేసేందుకు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం చారిత్రక అవసరమని గాజువాక నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన అక్కిరెడ్డిపాలెం పంచవటి కాలనీలోని గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారం చేపట్టారు. ఆయనకు కాలనీవాసులతో పాటు 68, 69 వార్డులకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతు గతంలో టీడీపీ చేపట్టిన అభివృద్ధితో పాటు ఇప్పుడు మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలే తనను గెలిపిస్తాయన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు అభివృద్ధిని విస్మరించి జనసేనాని పవన్‌కల్యాణ్‌ను తిట్టడమే లక్ష్యంగా పెట్టుకోవడం బాధాకరమని, అటువంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, రౌతు శ్రీనివాసరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, శీరం రాజేశ్, అలమండ రాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీభరత్, 'పల్లా'లను గెలిపించుకుందాం

కూర్మన్నపాలెం: తెలుగుదేశం పార్టీ విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్, గాజువాక అసెంబ్లీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావులను గెలిపించడమే ధ్యేయంగా ముందుకు సాగుదామని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. ఇక్కడి మాతృశ్రీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రీన్ సిటీలో మంగళవారం జరిగిన మూడు పార్టీల ఆత్మీయ సమావేశాన్ని సక్సెస్ చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో అందరూ పడుతున్న ఇక్కట్లను, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, ఎం.కనకరాజు, రమణ, అప్పారావు, ఎర్రయ్య, నూక అప్పారావు, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లూరు సూర్యనారాయణ



శ్రీహరిపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్



మల్కాపురంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

ప్రజా సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యం

పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం, మార్చి 27: ప్రజా సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 60వ వార్డు పరిధి శ్రీహరిపురంలో బుధవారం సాయంత్రం ఆయన ప్రచారం చేపట్టారు. తొలుత జవహర్‌నగర్ రోడ్డులో ఉన్న అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ సర్కారు ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులను సమాంతరంగా చేపడుతుందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా తాను ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానని, ఎమ్మెల్యే తనను గెలిపిస్తూ మరింత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనకు అడుగడుగునా మహిళలు మంగళహారతులిచ్చి పూలమాలలు వేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి మునిసిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి, వైసీపీ నియోజకవర్గ పరిశీలకురాలు పి.ఉమారాణి, నాయకులు అంగ రామ్‌ప్రసాద్, ఆడారి హరీశ్, జీవీఎల్ నరేశ్, కొల్లి నూకరెడ్డి, గులిగిందల కృష్ణ, కనకమహాలక్ష్మి దేవస్థానం డైరెక్టర్ మళ్ల ధనలత, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురంలో ఆత్మీయ సమావేశం

జనసేన నుంచి వైసీపీలో చేరిన ఎం.అప్పారావు (హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టర్) ఆధ్వర్యంలో రాత్రి జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన అప్పారావు సేవలు పార్టీకి ఎంతో అవసరమన్నారు. అప్పారావు మాట్లాడుతూ జగన్ పాలనను నచ్చి వైసీపీలో చేరానన్నారు. సమావేశంలో వైఎస్సార్‌టీయూసీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ కలిదండి బద్రీనాథ్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీనివాస్, జి.వెంకటసత్యనారాయణరాజు (వాసు), బి.నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేసే యూనియన్‌లకు గుర్తింపు: ఉక్కు సీజీఎం గాంధీ

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 27: కార్మికుల సమస్యలపై పోరాడి వారి సంక్షేమానికి కృషి చేసిన యూనియన్లకు మంచి గుర్తింపు ఉంటుందని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (హెచ్‌ఆర్) జి.గాంధీ అన్నారు. ప్లాంట్ డీవీఆర్‌ఈఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఉక్కు కర్మాగారంలో, గంట్యాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల జెండాలు ఆవిష్కరణ చేశారు. ఇందులో భాగంగా మొక్కలు నాటిన సీజీఎం మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన అంశాలపై మాట్లాడి పరిష్కరించడంలో యూనియన్ చేసిన కృషిని ప్రశంసించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి డీవీ రమణారెడ్డి మాట్లాడుతూ కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గల్లా శంకర్ సాయిరాం, నాయకులు పేర్ల నూకరాజు, వేణువర్మ, వి.మహాలక్ష్మినాయుడు, టీవీ శంకర్, తిప్పల గురునాథరెడ్డి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సీజీఎం జి.గాంధీ, తదితరులు




కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

జనసేన అభ్యర్థి పంచకర్ల వాహనం తనిఖీ

పెందుర్తి, మార్చి 27: పెందుర్తి నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు వాహనాన్ని బుధవారం పోలీసులు తనిఖీ చేశారు. అనకాపల్లిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొని పెందుర్తి వైపు వస్తున్న పంచకర్ల కారును రాంపురం వద్ద నిలిపి తనిఖీలు చేపట్టారు. కారు ముందు సీటు, డిక్కీ తెరచి సోదాలు చేశారు. ఆ సమయంలో పంచకర్ల కారులోనే ఉన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే పరిశీలించినట్టు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ ప్రతినిధి కొల్లి వెంకటరావు తెలిపారు.

రూ.కోటీ ఏడు లక్షల ఆస్తి పన్ను వసూలు



జెడ్సీకి చెక్కులను అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

గాజువాక, మార్చి 27: జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయ పరిధిలో బుధవారం ఒకరోజే కోటీ ఏడు లక్షల రూపాయల ఆస్తి పన్నును అధికారులు వసూలు చేశారు. పలు వార్డులోని నివాసితులు, వివిధ సంస్థల నుంచి వసూలు చేసిన చెక్కులను బుధవారం జోనల్ కమిషనర్ సన్యాసినాయుడుకు రెవెన్యూ అధికారులు రాంనారాయణ, శ్రీకాంత్, ఆర్‌ఐలు మోహన్, శివ, సుభాన్‌లు అందజేశారు. ప్రతిఒక్కరూ ఆస్తి పన్ను చెల్లించాలని, నెలాఖరులోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ జరుగుతుందని జోనల్ కమిషనర్ పేర్కొన్నారు.

వైభవంగా ముగిసిన పైడితల్లమ్మ ఉత్సవాలు

కూర్మన్నపాలెం, మార్చి 27: జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్ కాలనీవాసుల ఆరాధ్య దైవం పైడితల్లమ్మ ఉత్సవాలు దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా ముగిశాయి. పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి పైడితల్లమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలు, పంచామృతాలతో అర్చకులు అభిషేకాలు చేశాక ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సొసైటీ ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్

ప్రగతిపథంలో దూసుకుపోతున్న థ్రిఫ్ట్ సొసైటీ

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 27: స్టీల్‌ప్లాంట్ థ్రిఫ్ట్ సొసైటీ రూ.361 కోట్ల టర్నోవర్‌తో ప్రగతిపథంలో ముందుకు సాగుతుందని సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం 59వ మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆడిట్‌లో ఏ-గ్రేడ్ సొసైటీగా నిలుస్తుందని, 12,993 మంది సభ్యులతో సొసైటీ నడుస్తుందన్నారు. కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి నివేదికను, కోశాధికారి డీవీఎస్ఎన్ కొండరాజు 2024-25 బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ రమణ, శ్రీనివాస్, మహీధర్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ కె.దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం పనులు నిలుపుదల

పెందుర్తి, మార్చి 27: చినముషిడివాడ శారదాపీఠం మార్గంలోని ప్రభుత్వస్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణ పనులను రెవెన్యూ సిబ్బంది నిలుపు చేశారు. 'ఆక్రమణలకు అడ్డాగా చిన ముషిడివాడ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ బంగార్రాజు ఆదేశాల మేరకు సిబ్బంది ఆక్రమ నిర్మాణాన్ని పరిశీలించారు. సంబంధించిన పత్రాలు తహసీల్దార్ కార్యాలయానికి తీసుకుని రావాలని నిర్మాణదారుడికి సూచించారు. అవి తప్పుడువని నిర్ధారణ జరిగితే నోటీసులు ఇచ్చి నిర్మాణాన్ని నేలమట్టం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. అప్పటివరకు పనులు చేపట్టవద్దని హెచ్చరించారు.

భవిత కేంద్రంలో దివ్యాంగులకు వైద్య పరీక్షలు

పెందుర్తి, మార్చి 27: భవిత కేంద్రం దివ్యాంగ చిన్నారులకు ఎంతో భరోసానిస్తుందని ఎంఈవో సువర్ణ అన్నారు. పాఠశాల విద్యాశాఖ సమగ్రశిక్షా సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ చేసేందుకు గాను గుర్తింపు నిర్ధారణకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆనందపురం, పద్మనాభం, చినగదిలి మండలాలకు చెందిన పలువురు దివ్యాంగ చిన్నారులకు వైద్య నిపుణులు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ అధికారి గీత, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజుబాబు

గాజువాక, మార్చి 27: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పెదగంట్యాడకు చెందిన ములకలపల్లి రాజుబాబును నియమించారు. బుధవారం ఆయనకు జిల్లా పార్టీ చైర్మన్ పెద్దాడ గణనాగఫణి ఉత్తర్వులు అందజేశారు. రాజుబాబును పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు, నాయకులు మహేశ్, యరబాల భూలోకలు అభినందించారు.



ఆర్‌ఆర్ వెంకటాపురంలో ప్రచారంలో పాల్గొన్న గణబాబు, తదితరులు

32వ వార్డులో గణబాబు ప్రచారం

గోపాలపట్నం, మార్చి 27: తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి అందరూ దోహదపడాలని పశ్చిమ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి పి.గణబాబు కోరారు. 92వ వార్డు పరిధిలోని ఆర్‌ఆర్ వెంకటాపురం, బాపూజీనగర్, శ్రీరామ్‌నగర్, తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1 నుంచి బయోమెట్రిక్ తప్పనిసరి

ఉద్యోగులు, కార్మికులకు స్పష్టం చేసిన ఉక్కు యాజమాన్యం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 27: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని ఉక్కు యాజమాన్యం పేర్కొంది, ప్రతి ఉద్యోగి తమ వివరాలను బయోమెట్రిక్‌లో నమోదు చేసుకోవాలని సూచించింది. ఇప్పటివరకు బయోమెట్రిక్‌తో పాటు డార్స్ విధానం కూడా అమలులో ఉంది. అయితే ఏప్రిల్ ఒకటి నుంచి మాత్రం కేవలం బయోమెట్రిక్ హాజరు మాత్రమే ఉంటుందని యాజమాన్యం స్పష్టం చేసింది. అందువల్ల ఇప్పటివరకు బయోమెట్రిక్‌లో వివరాలు నమోదు చేసుకోని వారంతా తక్షణమే నమోదు చేసుకోవాలని సూచించింది.

బార్స్ కమిటీ సమావేశం

బార్స్ కమిటీ బుధవారం స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) కార్యాలయంలో సమావేశమైంది. కమిటీ ప్రతినిధులు పలు అంశాలను ఉక్కు యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని, మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని, కొన్ని విభాగాల ఉద్యోగులకు సమయంలో కొంత వెసులుబాటు ఇవ్వాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించాక ఏప్రిల్ రెండున సమావేశం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్:** మెలోడీ, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా:** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్:** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర:** మౌర్య (గోపాలపట్నం)
- **గామి:** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 14, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 20, క్యారేట్ 26, దొండకాయలు 20, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 144, బరబటి 30, ముల్లంగి 16,నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 30, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 144, కొబ్బరికాయ (పెద్దది) 22,బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 58, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 60, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	-- 107
ఫారం ధర	-- 127
విత్ స్కిన్	-- 224
స్కిన్‌లెస్	-- 234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 12లో..

ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలి: ఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హెస్సేన్ సాహెబ్

జ్ఞానాపురం, మార్చి 27: ఎన్నికలు నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేపట్టాలని పశ్చిమ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం జ్ఞానాపురంలోని పశ్చిమ నియోజకవర్గ ఆర్వో కార్యాలయ సమావేశ మందిరంలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసీసీ, వీఎస్టీ బృందాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులపై త్వరతగతిన స్పందించాలన్నారు. రాజకీయపార్టీలు ఎన్నికల నియమావళి పాటిస్తున్నారా.. లేదా.. అన్న విషయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలన్నారు.

కేవీలో విద్యార్థులకు ప్రగతి కార్డులు పంపిణీ


విద్యార్థులతో కేవీ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, మార్చి 27: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న బాలవాటిక, ఐదో తరగతి విద్యార్థులకు రిపోర్టు కార్డులను బుధవారం కేవీ ప్రిన్సిపల్ కమల్‌జిత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పిల్లలను చక్కగా తీర్చడానికి వీలుంటుందన్నారు.ఐదో తరగతి పిల్లలు ప్రైమరీలో అత్యధిక తరగతి హోల్డర్లుగా ఉన్నారన్నారు. ఇలాంటి వారు ఆరో తరగతిలో మరింత మార్పుతో చక్కగా చదువుతారని పేర్కొన్నారు. ఈ పిల్లలకు కొత్తస్థాయికి సర్దుబాటుకు వీలుగా బ్రిడ్జ్ కోర్సు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వీఎం శైలజ, ఉపాధ్యాయులు జి.వాణి, విజయలక్ష్మి, భవాని, డాక్టర్ త్యాగరాజ్, మిట్టపల్లి రేఖ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు సెలవు

భీమునిపట్నం (రూరల్) మార్చి 27: ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఒకరోజు స్పెషల్ కేజువల్ లీవ్‌ను వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది ఈ మేరకు 536 నంబరుతో ఉత్తర్వులను జారీ చేసింది. విధుల్లో నియమితులై, వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు తమ నియోజకవర్గంలో ముందుగా ఓటు వేసుకునే వీలుంటుంది. వీరికి ముందుగానే పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. ఓటును రిటర్నింగ్ అధికారికి పంపించడానికి వీలుగా ప్రతి నియోజకవర్గంలో ఫెసిలిటేటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇవి నియోజకవర్గ కేంద్రాలలో రిటర్నింగ్ అధికారి వద్ద ఉంటాయి. ఇక్కడ పోస్టల్ బ్యాలెట్ అందజేయడానికి స్పెషల్ కేజువల్ లీవ్‌ను వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. ఇతర సెలవులతో సంబంధం లేకుండా ఈ సెలవును ఉద్యోగులంతా వాడుకునేలా ఉత్తర్వులిచ్చారు.

సెయింట్ జోసెఫ్‌ను సందర్శించిన తెలుగు అధ్యాపకులు


బెంగళూరునుంచి వచ్చిన అధ్యాపకులు

జ్ఞానాపురం, మార్చి 27: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలను మైసూర్‌లోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ సంస్థ (సీఐఐఎల్)లో శిక్షణ పొందుతున్న దక్షిణ భారతదేశంలోని తెలుగు అధ్యాపకులు బుధవారం సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాలలోని విద్యాసంబంధ కార్యక్రమాల అమలు తీరు, గ్రంథాలయంలో వివిధ భాషల పుస్తకాలను చూసి సంతోషం వ్యక్తంచేశారు. అనంతరం విద్యార్థులతో తెలుగులో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, డాక్టర్ మిరియాల సత్యనారాయణ, డా.జె.నిర్మల, డాక్టర్ దీప్తి, సిస్టర్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

అరణ్య అవుట్‌డోర్ క్యాంపింగ్‌తో వికాసం : రైల్వే జీఎం


యాక్టివిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జీఎం మనోజ్ శర్మ

విశాఖపట్నం, మార్చి 27: వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహిస్తున్న మాంటిస్సోరీ స్కూల్, హెరిటేజ్ వాక్స్‌కు సంబంధించి అరణ్య అవుట్‌డోర్‌క్యాంపింగ్, యాక్టవిటీ సెంటర్‌ను తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంటిస్సోరి స్కూల్ విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యానికి అవుట్‌డోర్ క్యాంపింగ్ సదుపాయం, స్కౌట్స్ అండ్ గైడ్స్ క్యాడెట్లకు యాక్టవిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసి వారిలో ప్రతిభకోసం కృషి చేస్తున్న వాల్తేర్ రైల్వే మహిళా సంక్షేమ సంఘ ప్రతినిధులుఅభినందనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు దివ్య శర్మ, డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, ఏడీఆర్ఎంలు సుదీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, ఈకార్యో అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్, కవితా గుప్తా, ముదుస్మిత సాహు పాల్గొన్నారు.

సీపీ రవిశంకర్ అయ్యన్నార్‌కు డీజీపీ గోల్డ్ డిస్క్ అవార్డు

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అయ్యన్నార్‌కు డీజీపీ గోల్డ్ డిస్క్ అవార్డు లభించింది. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచే అధికారులు, సిబ్బందికి డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి మూడు కేటగిరీల్లో డిస్క్ అవార్డులను బుధవారం ప్రకటించారు. సీపీ రవిశంకర్ అయ్యన్నార్‌తోపాటు సీసీఎస్ ఏఎస్ఐ పి.చంద్రశేఖర్, పెందుర్తి క్రైమ్ కానిస్టేబుల్ ఎం.రఘురామ్‌లకు గోల్డ్‌డిస్క్ అవార్డు లభించింది. డీజీపీ బ్రాంజ్ డిస్క్ కేటగిరీలో ఏఆర్ ఏడీసీపీ కె.సుబ్రహ్మణ్యం, దిశ ఏసీపీ సీహెచ్ వివేకానంద, దిశ సీఐ జి.నిర్మల, సీఐ ఎన్వీ ప్రభాకరరావుతోపాటు మరో పదిమందికి అవార్డులు దక్కాయి.


దసపల్లా వద్ద ఫుట్‌పాత్‌లపై వ్యాపార సామగ్రి


జగదాంబ వద్ద ముందుకు వచ్చిన దుకాణం పైభాగం

ఓవైపు విస్తరణ పనులు.. మరోవైపు ఆక్రమణలు

» వన్‌టౌన్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు

జగదాంబ కూడలి, మార్చి 27: జగదాంబ నుంచి వన్‌టౌన్ వరకు రోడ్డు విస్తరణ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా జీవీఎంసీ అధికారులు చేపట్టిన రోడ్డు విస్తరణకు ఫుట్‌పాత్ వ్యాపారులనుంచి సమస్యలు నెలకొంటున్నాయి. ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు, వ్యాపార వర్గాలు తమ స్థలాలను వదులుకుని సహకరించడంతో రోడ్డు విస్తరణ పనులు సజావుగా సాగుతున్నాయి. పెరుగుతున్న జనాభా, వాహనాలతోపాటు పాతనగరం అభివృద్ధిలో భాగంగా ఈ పనులు పూర్తిచేస్తున్నారు. మరోవైపు రోడ్లు, ఆధునికీకరించిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమిస్తున్నారు. ఇప్పటికే నగరంలో ఆధునికీకరించిన ఫుట్‌పాత్‌లు, వ్యాపార కూడళ్లు సరికొత్త అందాలను తెచ్చిపెడుతున్నాయి. కానీ, జగదాంబ జంక్షన్ వాచ్‌హౌస్, దసపల్లా మెయిన్‌రోడ్డులో ఫుట్‌పాత్ నిర్మాణాలు పూర్తయినా, వీటిని పూర్తిగా ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు కోట్లాది రూపాయల ప్రజల సొమ్ముతో ఆధునికీకరించిన స్థలాలు, ఫుట్‌పాత్‌లు ఇలా ఆక్రమణలకు లోనుకావడంపై జనాలనుంచి విమర్శలు తలెత్తుతున్నాయి. జగదాంబ, టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్ కొత్త రోడ్డు, కురుపాం మార్కెట్ ఏరియాల్లో కొత్తగా చేపట్టిన ఫుట్‌పాత్‌ల్లో చాలా మేరకు ఆక్రమణలోకి వెళ్లాయి. దీంతో రోడ్డుపై జనం నడిచేందుకు అవకాశం లేని పరిస్థితి నెలకుంది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ 60 అడుగుల రోడ్డు విస్తరించినట్లు గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేగా ఉంది. ఆయన తన అనుచరగణం చెప్పిన వారికి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు అవకాశమిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఎన్నికల నిబంధనలు పాటించాలి: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులదే కీలకపాత్రని, వారంతా తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టరు ఎ.మల్లికార్జున ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రిటర్నింగ్, పోలింగ్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్ బృందాలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఆర్వోలు తప్పనిసరిగా నియమావళిని పాటించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాలు, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, గోడపత్రికలు, బ్యానర్లు అనుమతించరాదన్నారు. జాతీయ రహదారి, ప్రధాన రహదారుల సమీపంలో ఇప్పటివరకు ఉన్న హోర్డింగ్‌లను సమాన ప్రాతిపదికగా అన్ని రాజకీయ పార్టీలకు కేటాయిస్తున్నామన్నారు. గోడలపై రాజకీయపార్టీలు అతికించిన స్టిక్కర్లు, గోడపత్రికలను తొలగించాలన్నారు. అయితే ఇంటిలోపల ఉన్న పోస్టర్లు, స్టిక్కర్లపై జోక్యం అవసరం లేదన్నారు. ఇంటి పైకప్పులపై సంబంధిత యజమాని అనుమతితో జెండాలు, బ్యానర్లు ఉంచుకోవచ్చునని అయితే దీనికి ఆర్వో అనుమతి ఉండాలన్నారు. వివిధ ప్రాంగణాల్లో శిలాఫలాకాలపై ఉన్న రాజకీయ నాయకుల పేర్లు తొలగించాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటివరకు జిల్లాలో పదిమంది వలంటీర్లపై కేసులు నమోదుచేసి, తొలగించామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఒక వ్యక్తి వద్ద వస్తు రూపంలో రూ.10 వేలకు మించరాదని, రూ.20 వేలకు మించి విరాళాలు స్వీకరించవద్దని, రూ.50 వేలకు మించి నగదు ఉండరాదని, అంతకుమించి ఉన్న నగదును సీజ్ చేస్తామన్నారు. డ్రగ్స్, మద్యం, ఆభరణాలు, వస్త్రాలు, ఇతర వస్తువులను పంపిణీ చేయరాదన్నారు. పార్టీలు నిర్వహించే ర్యాలీలు, సభలకు సీవిజల్ ద్వారా దరఖాస్తు తీసుకున్న 48 గంటల్లో అనుమతి ఇవ్వాల్సి ఉందని, అయితే దరఖాస్తులను తక్షణమే పరిశీలించి మంజూరుచేయాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదయ్యేలా చూడాలని, గత ఎన్నికల్లో 65 శాతం నమోదైందన్నారు. ఈసారి 75 శాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో నగరంలో ఐదువేల చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టిసారించాలన్నారు. వచ్చే నెల 14 వరకు ఫారం 6 కింద ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరించవచ్చునన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పోస్టల్ బాలెట్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. మొత్తం ఎనిమిది రకాల పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయన్నారు. సమావేశంలో ఎంసీసీ నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంతవర్మ, జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో మోహనకుమార్, ఆర్వోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, శేషశైలజ, లక్ష్మారెడ్డి, అఖిల, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలు


వైసీపీ బీసీ సెల్ నేత మాన్యాలకు జనసేన కండువా వేస్తున్న వంశీకృష్ణ

మహారాణిపేట, మార్చి 27: రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌ల నాయకత్వం అవసరమని దక్షిణ నియోజకవర్గ టీడీపీ, జనసేన, టీడీపీ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 100 మందికి పైగా ఆపార్టీ కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. వారికి వంశీకృష్ణ శ్రీనివాస్ జనసేన పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, పవన్ కల్యాణ్ సత్తా ఉన్న నేత అని అన్నారు. వారి నాయకత్వం రాష్ట్రానికి ఉందన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిని ప్రజలు కోరుకుంటున్నారని, ఈ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపొందుతారని ఆయన ఆశాభావంవ్యక్తంచేశారు. నాయకులు షైలి పిల్లి సూర్యారావు, పెద్దరాజు గిరిబాబు , కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీకి అభినందనలు


గండిబాబ్జీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

మాధవధార, మార్చి 27; తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన గండి. బాబ్జీని 50వవార్డు ఆ పార్టీ అధ్యక్షులు సనపల. వరప్రసాద్, తెలుగుమహిళా విభాగం నాయకురాలు ఈతలపాక సుజాత, 49, 54, 46, 53వవార్డుల నాయకులు చక్రి, సౌజన్య, రాజు, కార్తీక్ కుట్టా తదితరులు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గండి బాబ్జీ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులంతా సమష్టిగా పనిచేయాలని సూచించారు. పార్టీ శ్రేణులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రతి ఓటరుకి వివరించాలని కోరారు.

సముద్ర మార్గంలో డీజిల్ అక్రమ రవాణా



మాట్లాడుతున్న డీసీపీ 2 సత్తిబాబు

» 13 మంది ముఠాలో ముగ్గురి అరెస్టు...పదిమంది పరారీ

మహారాణిపేట, మార్చి 27: సముద్ర మార్గం ద్వారా డీజిల్ అక్రమంగా రవాణా చేసి విక్రయిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నామని డీసీపీ 2 సత్తిబాబు తెలిపారు. ఈ ముఠాలో మొత్తం 13 మంది సభ్యులు ఉండగా వారిలో ముగ్గురిని అరెస్టు చేశామని, మరో పదిమంది పరారయ్యారన్నారు. పోలీసు కమిషనరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. విశాఖకు చెందిన ఆయిల్ మాఫియా ముఠా కాకినాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాల నుంచి బోట్ల ద్వారా డీజిల్‌ను అక్రమంగా సేకరించి, విశాఖ ఫిషింగ్ హార్బర్ జట్టీ వద్దకు తరలించి, లీటరు రూ.60 నుంచి రూ.70 చొప్పున విక్రయిస్తోందన్నారు. దీనిపై పక్కాగాసమాచారం అందడంతో బుధవారం ఉదయం పోలీసులు దాడులు జరిపారన్నారు. ఇందులో భాగంగా డీజిల్ కొనుగోలు చేస్తున్న నగరవాసి సూరాడ రామును అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. అతడు తెలిపినవివరాల మేరకు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన బడే రాజు, నొల్లు వీర్రాజు లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 480 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈముఠాలో మరో పది మంది పరారీలో ఉన్నారని,వారి కోసంగాలిస్తున్నామన్నారు.

విధుల్లో అలసత్వంపై ప్లానింగ్ కార్యదర్శి సస్పెన్షన్‌కు ఆదేశం


దువ్వాడ రైల్వే స్టేషన్ రహదారిలో పర్యటిస్తున్న అడిషినల్ కమిషనర్ విశ్వనాథ్

కూర్మన్నపాలెం, మార్చి 27: భరత్‌నగర్-2 ప్లానింగ్ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్న సాయిరామ్‌పై పలు ఫిర్యాదులు రావటంతో ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని జీవీఎంసీ అడిషినల్ కమిషనర్ విశ్వనాథ్ ఆదేశాలు జారీ చేశారు. జీవీఎంసీ 86 వార్డు కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్ రహదారి విస్తరణ పనులను బుధవారం ఏడీసీ పర్యటించారు. ఉడాఫేజ్-6లో రోడ్డుకిరువైపులా రబ్బీస్, నిర్మాణ సామగ్రి ఉండటం గుర్తించిన ఆయన సదరు ప్లానింగ్ కార్యదర్శులు అన్నెపు శ్రీను,సాయిరామ్‌లపైఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల్లో అలసత్వం వహించినా, అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని ఈసందర్భంగా హెచ్చరించారు.ఇటీవల ప్లానింగ్ కార్యదర్శులపై ఎక్కువగాఫిర్యాదులువస్తున్నాయన్నారు. ఈపర్యటనలోఏసీపీ లక్ష్మీఈఈ ప్రసాద్, ఏడీఈ రాము, ఏఎంహెచ్‌ఓకిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో శత శాతం సౌకర్యాల కల్పన: జేసీ


అధికారులతో మాట్లాడుతున్న జేసీ అశోక్

మహారాణిపేట, మార్చి 27: ప్రతీ సెక్టార్ అధికారి తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శతశాతం కనీస సదుపాయాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ కే మయూరి అశోక్ ఆదేశించారు. బుధవారం తూర్పు నియోజకవర్గానికి సం బంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈఆర్వో, సెక్టోరియల్ రూట్ అధికారుల, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేం ద్రాల్లో విద్యుత్, తాగు నీటి తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.ఈనెలాఖరులోగా వసతుల ఏర్పాటుపై పూర్తి చర్యలు తీసు కో వాలని కోరారు. ప్రజల్లో ఓటు హక్కుపై చైతన్యం కలిగించేలా అవగాహన క ల్పించాలని కోరారు.

ఎన్నికల నియమావళి అమలుకు పటిష్ఠ చర్యలు

తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు జేసీ అశోక్ తెలిపారు. తన చాంబర్‌లో తూర్పు ని యోజకవర్గం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కొత్తగా ఓటు నమోదు దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి తర్వాతే ఆమోదిస్తామన్నారు. ఈ సమావేశంలో అన్ని పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నీటి ప్రాజెక్టులకు గాలికొదిలేశారు!

... 5వ పేజీ తరువాయి

నిర్వహణ, ఆధునికీకరణపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తొలిసారిగా 2020-21లో రూ.80.91 లక్షలు, 2021-22లో రూ.99.8 లక్షలు, 2022-23లో 89.93 లక్షలు బడ్జెట్‌లో కేటాయించినా రూపాయి విడుదల చేయలేదు. గత ఏడాది మార్చిలో నిర్వహణ, మరమ్మతులకు రూ.ఆరు కోట్లు కేటాయించినా ఇంతవరకూ కాంట్రాక్టర్లు ఎవరు ముందుకురాలేదు. అయితే ఈ నిధులు కూడా విడుదల కాలేదు. కమాండ్‌ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద సుమారు రూ.3.5 కోట్లు పనులకు నాలుగేళ్ల క్రితం ఆమోదం తెలిపారు. వాటిలో రూ.2 కోట్ల బిల్లులు కాగా మరో రూ.1.5 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. డ్యామ్ నిర్వహణ బిల్లులు చాలా వరకు చెల్లించాల్సి ఉంది.

రైవాడ రిజర్వాయర్ నిర్వహణ, మరమ్మతులకు 2021-22 బడ్జెట్‌లో రూ.9.28 లక్షలు, 2022-23లో రూ.171.75 లక్షలు కేటాయించినా పైసా విడుదల చేయలేదు. జపాన్ రుణం రూ.30.43 కోట్లతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఇప్పటి వరకూ రూ.4.17 కోట్లు ఖర్చు చేయగా రూ.2.88 కోట్లు బిల్లులు మంజూరుచేశారు. మిగిలిన మొత్తంవిడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ తట్టాబుట్టా సర్దుకుని వెళ్లిపోయారు. ప్రాజెక్టు వ్యయంలో 85 శాతం జపాన్ విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 15 శాతం ఇవ్వాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా సొమ్ము విడుదల చేయకపోవడంతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. అలాగే కోనాం రిజర్వాయర్, కాలువల నిర్వహణ, మరమ్మతులకు 2019-20 నుంచి 2022-23 వరకు రూ.80.86 లక్షలు, పెద్దేరుకు రూ.2.65 లక్షలు మాత్రమే కేటాయించారు. అవికూడా విడుదల చేయలేదు. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా ప్రాజెక్టుల నిర్వహణ అంటే జనరేటర్‌కు డీజిల్, గేట్లకు గ్రీజు, విద్యుత్ బిల్లులు, ఇతరత్రా ఖర్చులకు అప్పులు చేయాల్సి వచ్చింది. పెద్దేరు రిజర్వాయర్ నుంచి అదనపు ఆయకట్టుకు నీరందించేందుకు రూ.9.12 కోట్లతో పనులు చేపట్టాలని గత ఏడాది ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ పనులకు గత ఏడాది రూ.84.4 కోట్ల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో టెండర్లు పిలవగా ఒకరు వచ్చారు.

చిన్న చెరువుల అభివృద్ధిపై నిర్లక్ష్యం

ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో ఆంధ్రప్రదేశ్ సమీకృత సేద్య, వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు (ఏపీఐఐఎటీపీ) కింద ఉమ్మడి జిల్లాలో రూ.33.46 కోట్లతో 50 చెరువుల పునరుద్ధరణకు ఆమోదం లభించింది. ప్రపంచ బ్యాంకు 70 శాతం నిధులు మంజూరుచేయగా, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వాటాగా ఇవ్వాల్సి ఉంది. మొదట 33 చెరువులకు సంబంధించి 13 పనులకు రూ.20.84 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే ఇప్పటివరకు కేవలం రూ.1.93 కోట్ల విలువైన పనులు పూర్తిచేయగా రూ.1.29 కోట్లు బిల్లులు మంజూరుచేశారు. అవి కూడా 2022లో బిల్లులు అప్‌లోడ్ చేయగా 2023లో ఖాతాలకు జమ అయ్యాయి. దీంతో పద్మనాభం మండలం రేవిడి గ్రామంలో యానాద్రి చెరువు, దేవరాపల్లి మండలం మునిడిపల్లెలో మాటలవాని చెరువు, నాగరాయుడు చెరువు, తెనుగుపూడిలో రాజుచెరువు పనులు సగంలో నిలిచిపోయాయి. కాగా ప్రపంచ బ్యాంకుతో చేపట్టాల్సి ఉన్న మిగిలిన 17 చెరువుల అభివృద్ధికి కాంట్రాక్టర్లు చేసుకున్న ఒప్పందాలు రద్దు చేసుకున్నారు. ఇదిలావుండగా శారదా నదిపై పలుచోట్ల గ్రోయిన్లకు ప్రత్యామ్నాయంగా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. జిల్లాల విభజనతో విశాఖలో ఉన్న జలవనరుల శాఖ ఈఈ కార్యాలయాన్ని నర్సీపట్నానికి తరలించారు. గత ఏడాది అక్టోబరు నెలాఖరున ఈఈ శ్రీనివాసరావు స్వచ్ఛంద పదవీ విరమణ చేయగా అప్పటి నుంచి నర్సీపట్నం డీఈ ఇన్‌చార్జిగా ఉన్నారు. అయినా ఉన్న సిబ్బందికే పని లేదు. ఇదిలావుండగా రానున్న ఖరీఫ్ నాటికి ప్రాజెక్టులు, కాల్వలను సిద్ధం చేయాల్సి ఉన్నా అధికారులు వాటి సంగతే మరిచిపోయారు. నిధుల కోసం కొత్తగా ప్రతిపాదనలు పంపవద్దని గత ఏడాది ప్రభుత్వం ఆదేశించింది.

ఆచితూచి...

... 5వ పేజీ తరువాయి

ఆయన పేరు ఖరారు చేసింది. బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్‌రాజు ఉండగా వైసీపీ తరఫున కేకే రాజు పోటీ చేస్తున్నారు.

భీమిలిపై తేలని ఉత్కంఠ

భీమిలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిపై ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. అక్కడి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అధిష్ఠానాన్ని కోరారు. అయితే విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయాలని చంద్రబాబునాయుడు ఆదేశించారు. కానీ గంటా మాత్రం భీమిలిపైనే ఆశలు పెట్టుకున్నారు. ఆయనతోపాటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కోరాడ రాజాబాబు, నెల్లిమర్ల ఇన్‌చార్జిగా పనిచేసిన కర్రోతు బంగార్రాజు, బైరా ఫౌండేషన్ చైర్మన్ దిలీప్ చక్రవర్తి కూడా భీమిలి సీటు ఆశిస్తున్నారు. ఇంకా ఎవరి పేరునూ ప్రకటించలేదు. అధికార పార్టీ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావునే అభ్యర్థిగా ప్రకటించింది. ఆయన ప్రచారం చేసుకుంటూ పోతున్నారు.

మహిళా సంఘాలకు వైసీపీ ఎర

... 5వ పేజీ తరువాయి

వారీగా మహిళా సంఘాల సభ్యులను రహస్యంగా ఒకచోట సమావేశపరిచి, అక్కడకు వైసీపీ అభ్యర్థులను ఆహ్వానిస్తున్నారు. కొంతమంది అభ్యర్థులు అక్కడికక్కడే మహిళలకు తాయిలాలుగా నగదు, చీరలు, కిట్‌లు అందజేస్తుంటే...మరికొందరు మాత్రం మరోసారి కలిసినప్పుడు పంపిణీలు ఉంటాయని హామీ ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కొద్దిరోజులు కిందట మురళీనగర్‌లో ఇదే తరహా సమావేశం ఏర్పాటుచేశారంటూ టీడీపీ నేతలు ఆరోపించగా, బుధవారం పెదవాల్తేరు, శివాజీపాలెంలో కూడా మహిళా సంఘాల సభ్యులతో వైసీపీ నేతలు, ఆర్పీలు సమావేశం ఏర్పాటుచేసినట్టు టీడీపీ నేతలు ఆరోపించారు. ఇలాంటి సమావేశాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు నిఘా పెట్టి, చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, ఎందుచేతనో ఆ పనిచేయడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో సౌభాగ్యలక్ష్మి ఆరాధనోత్సవం


అలంకరణలో అమ్మవారు

జగదాంబ కూడలి, మార్చి 27: శ్రీ మహాలక్ష్మి జయంతిని పురస్కరించుకుని వీసవీ క్లబ్ వనిత కేసీజీఎఫ్ వైజాగ్ ఫెమినా ఆధ్వర్యంలో బుధవారం అబింకాబాగ్ రామాలయంలో శ్రీ సౌభాగ్యలక్ష్మి ఆరాధనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యాక్రమంలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కేసీజీఎఫ్ వైజాగ్ ఫెమినా చైర్‌పర్సన్ బీవీ సావిత్రి సౌభాగ్యలక్ష్మి ఆరాధనోత్సవం విశిష్టతను మహిళలకు వివరించారు. శ్రీమహాలక్ష్మి జయంతి రోజున సౌభాగ్యలక్ష్మిని ఆరాధిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయన్నారు. పూజానంతరం మహిళలకు వాయినాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ వనిత వింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న మహిళలు

రైతుబజారులో తూనిక కాటాల తనిఖీ

సీతమ్మధార, మార్చి 27 : స్థానిక రైతుబజారులో తూనిక కాటాల సీళ్లు, స్టాంప్‌లను మెట్రోపాలజీ ఇన్‌స్పెక్టర్ రామారావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. కొన్ని కాటాలకు సీళ్లు లేకపోవడం, ఇతర కారణాలతో జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటాలకు తప్పకుండా సీళ్లు, స్టాంపులను వేయించుకోవాలని, లేకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

32వ వార్డులో జనసేన ప్రచారం

అల్లిపురం, మార్చి 27: టీడీపీ, జనసేన, బీజేపి ఉమ్మడి అభ్యర్థి వంశీ కృష్ణ టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీతో కలిసి 32వవార్డు గోకుల్ థియేటర్ పాంతంలో ప్రచారం ప్రారంభించారు. ఇంటిఇంటికీ వెళ్లి వారి సమస్యలను అ డిగి తెలుసుకున్నారు. ఉమ్మడి ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

కొమ్మాది, మార్చి 27: కారుఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. పీఎం పాలెం సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. మధురవాడలోనిచంద్రంపాలెం శ్రీనివాసనగర్‌లో కోన్న అప్పారావు (53) నివా సం ఉంటున్నాడు. సోమవారం ఉదయం అతను తన భార్య, కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంపై నగరంలోకి వెళుతుండగా వెనుక నుం చి కారు ఢీకొంది. దీంతో అప్పారావుకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి.బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.



యువతులతో మాట్లాడుతున్న ఎంపీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీలో ఎంపీ ప్రచారం

ఎంవీపీ కాలనీ, మార్చి 27 : వైసీపీ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిందని ఆ పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన ఎంవీపీకాలనీ ఆరో సెక్టరులో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

ఎంవీపీ కాలనీ, మార్చి 27 : అర్హులైన వారు వచ్చే 15 లోగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఈ విషయమై యువతకు అవగాహన కల్పించాలని జోనల్ కమిషనర్ శైలజా వల్లి డ్వాక్రా సభ్యులను కోరారు. బుధవారం ఆమె తూర్పు నియోజకవర్గం పరిధిలోని పలు పొదుపు సంఘాల మహిళలకు మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓట్ల నమోదుకు మహిళలు తమవంతు సహకారం అందించాలని కోరారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

పద్మనాభం, మార్చి 27 : మండలంలోని పలు గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ దళాలు బుధవారం కవాతు నిర్వహించాయి.ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల భద్రతకు భరోసా కల్పిస్తూ రెడ్డిపల్లి, తునివలస, చిన్నాపురం, కొయ్య పేట, నేరేళ్లవలస తదితర గ్రామాల్లో కవాతు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్సై సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటమి తప్పదు : ప్రణవ్

ఎంవీపీ కాలనీ, మార్చి 27 : వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ అన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రగ్స్, కిట్స్, కరెన్సీ వంటివి కంటైనర్లలో తరలిస్తున్న వైసీపీ వాటినే నమ్ముకుందని విమర్శించారు. నేరాలన్నీ వారే చేసి, ఎదుటి వారిపై నెట్టేయడం అలవాటైపోయిందన్నారు.

అనుమతి లేకపోతే చర్యలు

పద్మనాభం (రూరల్), మార్చి 27 : రాజకీయ నేతలు గ్రామాల్లో చేసే ప్రచారానికి రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలని ఎంపీడీవో బి. శైలజ సూచించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రచారంలో బ్యానర్లు, పోస్టర్లు, కటౌట్లు, స్పీకర్ల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు.

గుడ్లవానిపాలెంలో తాగునీటి సమస్య

సాగర్‌నగర్, మార్చి 27 : గుడ్లవానిపాలెంలో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద పైపు లైన్ పగిలిపోవడంతో కొద్దిరోజులుగా నీరు వృథాగాపోతోంది. దీంతో గ్రామంలో కొన్నిచోట్ల పూర్తిగా కుళాయిల ద్వారా నీరు సరఫరా కావడం లేదు.మరికొన్నిచోట్ల సన్నటి ధార మాత్రమే వస్తోంది. పైప్‌లైన్ మరమ్మతుకు గురై సుమారు 15 రోజులు కావస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలో, మార్చి 27 : ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని హనుమంతవాక 11 కేవీ ఫీడర్ నిర్వహణ దృష్ట్యా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.చినగదిలి, పెదగదిలి, దీనదయాళపురం, కమ ర్షియల్ ట్యాక్స్ కార్యాలయం ప్రాంతం, ఎస్‌సీ కాలనీ, సాలిపేట ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

ఏయూను సందర్శించిన ఇన్ఫోసిస్ ప్రతినిధులు

వెంకోజీపాలెం, మార్చి 27 : ఏయూను ఇన్ఫోసిస్ విశాఖ కేంద్రం ప్రతినిధులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి మూర్తి, ఇన్ఫోసిస్ విశాఖ డెలివరీ సెంటర్ హెడ్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా :** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్ :** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర :** మౌర్య (గోపాలపట్నం)
- **గామి :** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 14, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 20, క్యారెట్ 26, దొండకాయలు 20, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 144, బరబటి 30, ముల్లంగి 16,నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 30, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 144, కొబ్బరికాయ (పెద్దది) 22,బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 58, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 60, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	107
ఫారం ధర	--	127
విత్ స్కిన్	--	224
స్కిన్‌లెస్	--	234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 12 లో..

త్వరలో 'మీ పోలింగ్ కేంద్రం ఎక్కడో తెలుసా'

- పోలింగ్ శాతం పెంపునకు వినూత్న కార్యక్రమం
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాస్కర్‌రెడ్డి

భీమునిపట్నం, మార్చి 27 : ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు మీ పోలింగ్ కేంద్రం ఎక్కడో తెలుసా అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆర్‌డీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలామందికి ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ఆసక్తి వున్నా, పోలింగ్ బూత్ ఎక్కడుందో తెలియక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకుని తాము బీఎల్ఓల ద్వారా ఓటరు స్లిప్పులు అందిస్తూ,వారు ఓటు వేయాల్సిన బూత్ ఎక్కడ ఉందన్న విషయమై అవగాహన కల్పిస్తామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కర్‌రెడ్డి

దీనికి రాజకీయ పక్షాలు సహకరించాలని కోరారు. ప్రతి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై విపులంగా వివరించారు. ఎన్నికల సంఘం ముద్రించిన ఎంసీసీ బుక్‌లెట్‌ను వాట్సాప్ గ్రూపుల్లో పంపిస్తామని, రాజకీయ పక్షాలకు ప్రింటెడ్ కాపీ అందిస్తామని తెలిపారు. ఒక పార్టీ వారు మరో పార్టీకి చెందిన వారిని వ్యక్తిగత దూషణలు చేస్తూ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడకూడదన్నారు. పార్టీలు తమ విధానాలను, మేనిఫెస్టోపై మాత్రమే ప్రచారం చేసుకోవాలని చెప్పారు. ఒకే వీధిలో రెండు పార్టీలు ప్రచారాలు, ర్యాలీలు చేయరాదన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ మద్యం దుకాణాలను రాత్రి వేళ మూసివేసే సమయాలు తగ్గిస్తే చాలావరకూ శాంతిభద్రతలు అదుపులో వుంటాయని అభిప్రాయపడ్డారు. టీడీపీ భీమిలి మండల అధ్యక్షుడు దంతులూరి అప్పలనరసింహరాజు మాట్లాడుతూ వలంటీర్లు వద్ద వున్న ప్రభుత్వ సెల్‌ఫోన్‌లను సీజ్ చేయాలని కోరారు. సమావేశంలో రాజకీయ నాయ కులు ముత్తంశెట్టి మహేష్, రాజు, యరబాల అనిల్‌ప్రసాద్, రాంబాబు, కంటుభుక్త రామానాయుడు, వాసుపల్లి అనిల్, పొట్టి రజనీకాంత్, తహసీల్దార్ టి. గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రీనివాసరావుకి హారతి పడుతున్న మహిళ



పూలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

మంగమారిపేటలో ముత్తంశెట్టికి ఘన స్వాగతం

భీమునిపట్నం, మార్చి 27 : ప్రజలు మరోసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే మరో ఐదేళ్ల పాటు సేవ చేస్తానని భీమిలి వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన 4వ వార్డు కె. నగరపాలెం - 2 సచివాలయం పరిధిలో ఉన్న పెదమంగమారిపేట, చినమంగమారిపేట, నరసింహనగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయనకు హారతులతో ఘన స్వాగతం పలికారు. కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. అనంతరం మంగమారిపేట జంక్షన్‌లో జరిగిన సభలో ముత్తంశెట్టి మాట్లాడుతూ నియోజకవర్గంలో వున్న 127 సచివాలయాల్లో గడప గడపకు తాను పర్యటించి, ప్రజల కష్టాలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసానన్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లలో రూ. 2,700 కోట్ల అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమానికి ఖర్చు చేశామని చెప్పారు. పర్యటనలో మహిళలు ముత్తంశెట్టికి అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వార్డు వైసీపీ అధ్యక్షుడు పాల రమణారెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్, నాయకులు చిన్నారావు, అచ్చారావు, నల్లబాబు, గుండాసు మధునాయుడు, వెంకట్, సింగన్న, మరుపిళ్ల చిన్నారావు, రమణ పాల్గొన్నారు.

చట్ట సభల్లో బీసీలకు ప్రాతినిధ్యం : వెలగపూడి

పెదవాల్తేరు, మార్చి 27 :రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చట్ట సభల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పిస్తామని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. బుధవారం ఆయన 21వ వార్డు చినవాల్తేరులో టీడీపీ వార్డు అధ్యక్షుడు పీతల అవినాష్, బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ సభలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం వంద కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని,నాలుగున్నరేళ్లుగా బీసీలకు ఎటు వంటి వ్యక్తిగత రుణాలు, పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. బీసీలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం టీడీపీతోనే సాధ్యమని, టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా వారి అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. అనంతరం చినవాల్తేరు, రజకవీధి, పీతలవీధి, ఈస్టు పాయింట్ కాలనీ ప్రాంతాలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మూర్తియాదవ్, వినయ్, చిన్ని, దేముడుబాబు, మదీనా, శంకర్, శ్రీను, సాయి, మురళీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



జయహో బీసీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

టీడీపీని గెలిపించండి

ఎంవీపీ కాలనీ : ఎన్నికల్లో ప్రజలు టీడీపీని గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం కోరారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి లాసన్స్‌బే కాలనీలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేగా వెలగపూడిని, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి పోతనరెడ్డి, రాజు, నరేంద్ర, వాసు, శివ,కళావతి, లక్ష్మీ, జీవిత గోపి, తారక, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పితాని దిబ్బలో..

రామ్‌నగర్ : పితానిదిబ్బలో కూడా టీడీపీ నాయకులు వెలగపూడికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. పార్టీ అధికార ప్రతినిధి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు త్రినాథ్, నల్ల అప్పలరాజు, నక్కా అన్నపూర్ణ, ఉరుకూటి పైడిరాజు, డిల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

హైందవ ఆచారాలకు నెలవు సింహగిరి క్షేత్రం

శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం, మార్చి 27 :వరాహలక్ష్మీనృసింహస్వామి క్షేత్రం సనాతన హైందవ సంప్రదాయాలు, ఆచారలకు నెలవు అని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. బుధవారం ఆయన శ్రీసుదర్శన నారసింహ మహాయజ్ఞంలో జరిగిన లఘు పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ కొన్ని శతాబ్దాల నుంచి అప్పన్న ఆలయంలో నిరంతరం వేదపఠనంతో పాటు ఇటువంటి ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ నిష్ణాతులైన పండితుల సారధ్యంలో జరుగుతున్న యజ్ఞంతో సనాతన హైందవ ధర్మపరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. సాయంత్రం ఆలయ ప్రధాన మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం వైభవంగా సాగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి శేష వాహనంపై అధిష్టింపజేశారు. ఈఓ శ్రీనివాసమూర్తితో సహా పలువురు అధికారుల నిర్వహణలో వాహనం ముందు కోలాటం, సన్నాయి వాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్చారణలు చేశారు. మార్గం పొడవునా గోవిందనామ స్మరణ మిన్నంటగా భక్తులు కర్పూర నీరాజనాలతో స్వామివారిని స్వాగతించారు. మహాయజ్ఞం పురస్కరించుకుని రాజగోపురానికి చేరువలోని కళావేదికపై శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.



శేష వాహనంపై తిరువీధి

'టీచర్ల ఆర్థిక బకాయిలు చెల్లించాలి'

పద్మనాభం (రూరల్), మార్చి 27 : ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లలో ఉద్యోగులను అనేకసార్లు చర్చలకు పిలిచి ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన 43 శాతం పీఆర్సీ కంటే మెరుగైన పీఆర్సీ ఇస్తామని 23 శాతమే ఇచ్చిందన్నారు. సీపీఎస్ కూడా రద్దు చేయలేదని, జీవో నెం. 117 ద్వారా దళిత వాడల్లోని విద్యార్థులను పరోక్షంగా ప్రాథమిక విద్యకు దూరం చేసిందన్నారు.

సంప్రదాయాన్ని గౌరవించాలి

వెంకోజీపాలెం, మార్చి 27 : యువత ప్రాచీన ధార్మిక విషయాల్లో ఉన్న జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని వక్తలు కోరారు. ఏయూ ఫిలాసఫీ అండ్ రెలీజియస్ స్టడీస్ విభాగం, ఏసీటీఏస్ సంయుక్త నిర్వహణలో బుధవారం 'ధార్మిక విజ్ఞాన పరిణామం-ప్రాచీన సంప్రదాయాలపై ఆధునిక దృక్పథాలు' అన్న అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన ఏసీటీఎస్ అకాడమీ ఆఫ్ హైయర్ ఎడ్యూకేషన్ సీఈఓ సంతోష్ జ్ఞానకణ్ మాట్లాడుతూ తన తండ్రి నెలకొల్పిన యాక్ట్స్ అకాడమీ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుందని,ఈమేరకు తమ అకాడమీ ఏయూతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. శ్రీకాకుళం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీ వీసీ ఆచార్య కాళంగి రెమి రజిని మాట్లాడుతూ మానవ సమాజంలో మత విశ్వాసాల కంటే మానవతా దృక్పథం నెలకొల్పవలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విష్ణుమూర్తి

భీమునిపట్నం, మార్చి 27 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సీహెచ్ విష్ణుమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన మంజుల విశాఖ ప్రభుత్వ ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అదే కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న విష్ణుమూర్తిని నియమించారు.

ముగిసిన సీతారామస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలు



సింహాచలం, మార్చి 27 : సింహగిరిపై గంగధార సమీపాన కొలువుదీరిన సీతారామస్వామి వార్షిక తిరుకల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి జరిగిన పుష్పాంజలితో ముగిసాయి. ముందుగా ఆలయ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సీతా, లక్ష్మణ, హనుమ సమేతంగా రాముని ఉత్సవమూర్తిని అధిష్టింపజేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహావచనములు జరిపి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం అర్చకులు పుష్పాంజలి సమర్పించారు. మంగళ నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నూకాలమ్మ సదరం పట్టు పునఃప్రారంభం

భీమునిపట్నం, మార్చి 27 : భీమిలిలో నూకాలమ్మ సదరం పట్టును పునఃప్రారంభించారు. మునిసిపల్ మార్కెట్ ఆవరణలో వున్న సదురుపట్టు గతంలో జీర్ణావస్థకు చేరుకుంది. దీని పునర్నిర్మాణానికి స్థానికులు ఎస్. రమణప్రసాద్, ఆడిదం కిషోర్ బాధ్యత తీసుకుని దాతల నుంచి రూ. 8 లక్షల విరాళాలు సేకరించి పనులు పూర్తి చేశారు. ఈమేరకు బుధవారం పునఃప్రారంభించారు.

30న అంతర్జాతీయ గణిత సదస్సు

వెంకోజీపాలెం, మార్చి 27 : ఏయూలోని గణిత శాస్త్ర విభాగంలో ఈనెల 30, 31 తేదీల్లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ప్యూర్ అప్లైడ్ అండ్ ఇంజనీరింగ్ మ్యాథమెటికల్ సైన్సెస్ అన్న అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సదస్సుకు డైరెక్టర్‌గా గణిత శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పి. అనురాధ కామేశ్వరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. సదస్సును ఉత్తరాంధ్ర సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్సెస్, ప్రొఫెసర్ ఎస్. మీనాక్షి సుందరం మెమోరియల్ సొసైటీ, ఏయూ గణిత శాస్త్ర విభాగం సంయుక్తంగా జరపనున్నాయి.



సదస్సులో పాల్గొన్న న్యాయశాస్త్ర నిపుణులు

'డిజిటల్ డేటాతో చట్టపరమైన సవాళ్లు'పై సదస్సు

మధురవాడ, మార్చి 27 : మధురవాడలోని ఎన్‌వీపీ న్యాయ కళాశాలలో డిజిటల్ డేటాతో చట్టపరమైన సవాళ్ల అన్న అంశంపై బుధవారం నుంచి జాతీయ స్థాయి సదస్సు ప్రారంభమైంది. సదస్సును ఆ కళాశాల కరస్పాండెంట్ ఎస్‌పీ రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని విభాగాల్లోనూ డిజిటల్ డేటా వినియోగిస్తున్నారని, దీనిపై కొన్ని చట్టపరమైన ఇబ్బందులు, సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. వాటిని ఎలా అధిగమించాలో వివరించారు. అనంతరం ఎన్‌వీపీ లా కళాశాల నుంచి ఎనిమిది మంది, ఐఐఎం నుంచి ఏడుగురు, సీఎంటీ బిజినెస్ స్కూల్ నుంచి ముగ్గురు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. న్యాయశాస్త్రంలో నిరంతర పరిశోధనలు అవసరమని అభిప్రాయపడ్డారు. సదస్సు రెండు రోజుల పాటు జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ శాస్త్ర నిపుణులు దీపికా దాస్, జె. అలక్ చంద్రుడు, ఇలవాడి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా కార్పెంటర్స్ దినోత్సవం



విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబుతో కార్పెంటర్ అసోసియేషన్ సభ్యులు

ఆరిలోవ, మార్చి 26 : విమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్స్, వడ్రంగి అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్పెంటర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పాడైన తలుపులు, కిటికీలు, బెంచీలు, బీరువాలకు మరమ్మతు చేశారు. అలాగే రోగులకు పండ్లు పంపిణీ చేశారు. విమ్స్ డైరెక్టర్ రాంబాబు అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పెంటర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల కన్నప్రసాద్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కందుకూరు రామ్మోహనరావు, బేతాళ సన్యాసిరావు, పూడి సురేష్, అలుగోలు సత్యారావు, చిత్తూరు కృష్ణ, టేకి కృష్ణ, తమిరి శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.